

# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

12.08.2026
బుధవారం | రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 43
పేజీలు : 08 | వెల: రూ.5

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.

## ఢిల్లీలో భద్రత కట్టుదిట్టం

- రెడ్‌ఫోర్ట్ నుంచి మెట్రో స్టేషన్ల వరకు నిఘా
- 19 మంది ఉగ్రవాదుల పోస్టర్లు విడుదల 6లో..



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 11, అనంతజనశక్తి న్యూస్**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థలు, ఖలిస్థానీ మూకల నుంచి ముప్పు ఉండొచ్చన్న నిఘా వర్గాల సమాచారంతో పోలీసులు విస్తృత భద్రతా చర్యలు చేపట్టారు. ఆకస్మిక నిరసనలు లేదా ఆందోళనలు వేడుకలకు అంతరాయం కలిగించే అవకాశం ఉందన్న అంచనాతోనూ భద్రతను పెంచారు. ఈ క్రమంలో ఇండియన్ ముజాహిదీన్, అల్‌ఖైదా, ఖలిస్థానీ గ్రూపులతో సంబంధం ఉన్నట్లు పేర్కొంటున్న 19 మంది మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల ఫొటోలు, పోస్టర్లను ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో పోలీసులు ఏర్పాటు చేశారు.

## రఘునందన్ రావు సంచలన ఆరోపణలు

- 40 వేల ఇళ్లలో గోల్‌మాల్?
- సబ్సిడీ నిధుల మళ్లింపుపై విమర్శలు
- తెలంగాణలో 200 కోట్ల సోలార్ స్కామ్.?
- కేంద్ర మంత్రికి రఘునందన్ ఫిర్యాదు



**హైదరాబాద్, ఆగస్ట్ 11, అనంతజనశక్తి న్యూస్**

తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రూ.200 కోట్ల సోలార్ కుంభకోణానికి పాల్పడిందని బిజెపి ఎంపీ రఘునందన్ రావు తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ ఆయన కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం, ప్రజలను వంచించడమని మండిపడ్డ ఆయన, ఉచిత విద్యుత్ పేరిట కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదోవ పట్టిస్తోందని ధ్వజమెత్తారు.

### సబ్సిడీ సొమ్ము మళ్లింపు.. ఒకే పథకంలో రూ.200 కోట్ల గోల్‌మాల్

'హర్ ఘర్ బిజిలీ ముక్త్ యోజన' పథకం కింద రాష్ట్రంలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వినియోగించుకునే 40 వేల ఇళ్లను గుర్తించి, వారి ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు అమర్చేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచిందని రఘునందన్ రావు వివరించారు. ఈ టెండర్లలో ఒక ఇంటిపై 2 కిలోవాట్ల సోలార్ ప్యానెల్ అమర్చేందుకు ఒక కంపెనీకి రూ.1,36,000లకు కాంట్రాక్ట్ కట్టబెట్టారని, అయితే ఆ కంపెనీ సబ్ కాంట్రాక్ట్‌ను కేవలం రూ.86,000లకే మరొకరికి ఇచ్చిందని బయట పెట్టారు. దీనివల్ల ఒక్కో ఇంటిపై ఏకంగా రూ.50 వేలు మిగులుతోందని తెలిపారు. 2లో..

## నా ఓటు తొలగించి, ఆట మొదలుపెట్టారు

- సర్‌పై ప్రకాష్ రాజ్ వార్నింగ్
- ప్రకాష్ రాజ్ ఓటు తొలగింపు



2లో..

**న్యూఢిల్లీ, ఆగస్టు 11, అనంత జనశక్తి న్యూస్**

ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రక్రియలో తన ఓటును తొలగించారని పేర్కొన్నారు. బెంగళూర్ నియోజకవర్గం ఓటర్ల జాబితా నుంచి తన పేరు తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను బెంగళూర్‌లోనే పుట్టి, పెరిగానని, ఇక్కడే చదువుకున్నానని అన్నారు. ఎంపీగా కూడా పోటీ చేశానని, తొలగించిన 65 లక్షల ఓటర్లలో తాను కూడా ఒకడినని అన్నారు.

# పాతబస్తీ మెట్రోకు వేగం

## ఎంజీబీఎస్‌చాంద్రాయణగుట్ట మెట్రో పనులకు.. సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్‌సిగ్నల్



**హైదరాబాద్, ఆగస్ట్ 11, అనంతజనశక్తి న్యూస్**

**హైదరాబాద్ మెట్రో విస్తరణలో కీలకమైన పాతబస్తీ కారిడార్ పనుల్లో కదలిక వచ్చింది. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు ప్రతిపాదించిన 7.5 కిలోమీటర్ల మెట్రో మార్గం పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. సంబంధిత అధికారులకు ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఉన్నతాధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్షలో పాతబస్తీ మెట్రోతో పాటు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు.**

ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మేర నిర్మించనున్న మెట్రో కారిడార్‌కు సంబంధించిన పనులను త్వరితగతిన ముందుకు తీసుకెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఈ మార్గంలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయడంతో పాటు మెట్రో నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియను త్వరగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు విస్తరణ, భూసేకరణ, టెండర్ల ప్రక్రియలను సమన్వయం చేసుకుంటూ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ముందుకు వెళ్లాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. పాతబస్తీ ప్రాంతానికి మెట్రో సేవలు అందుబాటులోకి వస్తే అక్కడి ప్రజలకు ప్రజా రవాణా మరింత సులభతరం కావడంతో పాటు నగరంలోని ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు కూడా ఉపయోగపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. పాతబస్తీ కారిడార్ నిర్మాణంలో ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఇందుకోసం ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులను సంప్రదించి అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలు తీసుకోవాలని ఆదేశించారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించడంతో పాటు నిర్మాణం, నిర్వహణ, ప్రయాణికుల సౌకర్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. 2లో..

- 7.5 కిమీ పాతబస్తీ కారిడార్ పనులు వేగవంతం
- భూసేకరణ, టెండర్లను త్వరగా పూర్తి చేయాలి
- సమన్వయంగా మెట్రో పనులు చేపట్టాలని దిశానిర్దేశం
- పాతబస్తీకి మెట్రోతో ప్రజా రవాణా సౌకర్యం
- మరింత మెరుగవుతుందని సీఎం వ్యాఖ్య
- ఢిల్లీ మెట్రో సాంకేతిక సలహాలు తీసుకోవాలి
- మెట్రో రద్దీ తగ్గించేందుకు అదనపు కోచ్‌లు



## మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం

- ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కింద
- రూ.422.10 కోట్లతో మరో 158 ఆవాసాలకు
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- తొలిసారి రోడ్డు సౌకర్యం కల్పించనున్నారు 2లో..



## హెచ్‌ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- మంత్రి దామోదర రాజనర్సింహ
- నేడు భారీ ర్యాలీ నిర్వహిస్తాం..

**హైదరాబాద్, ఆగస్టు 11, అనంత జనశక్తి న్యూస్**

హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు బుధవారం భారీ ర్యాలీని నిర్వహించనున్నట్లు మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్, సిఫిలిస్ నియంత్రణే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రేపు ఉదయం 7 గంటలకు హైదరాబాద్‌లో భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు చెప్పారు. ఐమాక్స్ పక్కన ఉన్న హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ నుంచి నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగనుందని మంత్రి తెలిపారు. సుమారు 1500 మంది ర్యాలీలో పాల్గొననున్నట్లు వెల్లడించారు. 2లో..



## తమిళం నేర్పలేనిది క్రైస్తవ మతం నేర్పింది

- విజయ్ మంత్రి వ్యాఖ్యల కలకలం
- మేరీ విల్సన్ వ్యాఖ్యలపై రాజకీయ దుమారం



2లో..



## కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడింది

- విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నది
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్
- జార్ఖండ్‌లో ఎస్ఎస్‌సీ పేపర్ లీక్ 2లో..
- ఎంతో మంది యువత జీవితం రోడ్డుపాలవుతోంది

## ఆక్వా రైతులకు మళ్ళీ తీపి కబురు

- రైతులపై విద్యుత్ భార భారాన్ని తగ్గించే లక్ష్యంతో..
- యూనిట్ విద్యుత్‌ను కేవలం రూ. 1.50కే
- ఇంధన శాఖ అధికారికంగా జీవో 2లో..



## అమెరికాలో ఏపీ టెక్కీ మృతి

- ఉద్యోగంలో చేరిన కొన్ని రోజులకే..
- కారు ప్రమాదంలో మరణించిన దిలీప్ కుమార్ 2లో..



## ఆస్తుల విషయంలో ప్రజలు ఆందోళన వద్దు

- అర్హులందరికీ న్యాయం చేస్తాం
- నిషేధిత భూములు, ఆస్తులపై
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలు

**హైదరాబాద్, ఆగస్ట్ 11, అనంతజనశక్తి న్యూస్**

తెలంగాణలో 22ఏ లేదా నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న భూములు, ఆస్తుల విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. చట్టబద్ధంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న సాంకేతిక, చట్టపరమైన సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. 2లో..





### రఘునందన్ రావు
# సంచలన ఆరోపణలు

(మొదటిపేజీ తరువాయి)

ఈ రకంగా మొత్తం 40 వేల ఇళ్లకు కలిపి రూ.200 కోట్ల మేర అవినీతి జరిగిందని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం 1 కిలోవాట్‌కు రూ.30 వేలు, 2 కిలోవాట్లకు రూ.60 వేల చొప్పున భారీగా సబ్సిడీ ఇస్తుంటే, మోదీ ప్రభుత్వం ఏమీ ఇవ్వడం లేదని కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఈ స్కామ్‌పై నిజాయితీగా స్పందించి విచారణకు ఆదేశించాలని, లేని పక్షంలో కేంద్రం నుంచి వచ్చే నిధులు నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**పార్లమెంట్ స్తంభనపై ప్రతిపక్షాలపై మండిపాటు**

పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగకపోవడంపై ఎంపీ రఘునందన్ రావు స్పందిస్తూ, సభను నడపడంలో అధికార పక్షంతో పాటు ప్రతిపక్షాలకు కూడా సమాన బాధ్యత ఉంటుందని గుర్తుచేశారు. ఢిల్లీ విద్యార్థుల ఆందోళనపై చర్చ ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రతిపక్షాల వద్ద సరైన సబ్జెక్ట్ లేకే రోజువారీ రచ్చ చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర హోంశాఖ మంత్రి కూడా దీనిపై సభలో సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, ప్రతిపక్షాల గొడవ వల్ల ఇతర ఎంపీలు సభలో ప్రజా సమస్యలపై మాట్లాడే అవకాశాన్ని కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం

**అమరావతి, ఆగస్టు 11, అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్రంలోని మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కింద రూ.422.10 కోట్లతో మరో 158 ఆవాసాలకు తొలిసారి రోడ్డు సౌకర్యం కల్పించనున్నారు. ఈ పనులను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 347 కిలోమీటర్ల మేర 146 రోడ్లు, 19 వంతెనలు నిర్మించనున్నారు. రహదారి సౌకర్యం లేని ఆవాసాలను గుర్తించి పనులకు అవసరమైన అంచనాలను అధికారులు రూపొందించారు. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, కడప, తిరుపతి, నెల్లూరు, ప్రకాశం, పల్నాడు, ఎన్టీఆర్, ఏలూరు, పోలవరం, విజయనగరం, శ్రీకాకుళం తదితర జిల్లాల్లో ఈ రహదారి పనులు చేపట్టనున్నారు.

ఐదేళ్ల నిర్వహణకు అదనంగా రూ.24.47 కోట్లు

నిర్మాణంతో పాటు రోడ్ల నిర్వహణకు కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది. రహదారులు, వంతెనల నిర్వహణ కోసం ఐదేళ్ల కాలానికి అదనంగా రూ.24.47 కోట్ల నిధులను విడుదల చేశారు. నిర్మించిన రహదారులు దీర్ఘకాలం ప్రజలకు ఉపయోగపడేలా నిర్వహణ చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే, మారుమూల గ్రామాల్లో నిర్మించే రోడ్లు, వంతెనల విషయంలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటించాలని డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ



మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. తాము నిర్మించే రోడ్లు పది కాలాల పాటు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని స్పష్టం చేశారు. రహదారి సౌకర్యం లేని గ్రామాలకు మెరుగైన రవాణా సదుపాయాన్ని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పవన్ కల్యాణ్ తెలిపారు. రోడ్లు, వంతెనల నిర్మాణం పూర్తయితే మారుమూల గ్రామాలకు బాహ్య ప్రపంచంతో మెరుగైన అనుసంధానం ఏర్పడుతుందని చెప్పారు.

విద్య, వైద్యం, మార్కెటింగ్‌కు మెరుగైన అవకాశాలు

రహదారి సౌకర్యం అందుబాటులోకి రావడం వల్ల గ్రామీణ ప్రజలకు అనేక ప్రయోజనాలు కలగనున్నాయని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, మార్కెటింగ్ సదుపాయాలు మరింత అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్లకు సులభంగా తరలించుకోవడంతో పాటు అత్యవసర వైద్య సేవలు కూడా వేగంగా పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

కేంద్ర సహకారంతో ప్రాజెక్టు

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సహకారంతో రాష్ట్రంలోని మరో 158 ఆవాసాలకు తొలిసారి రోడ్డు సౌకర్యం కల్పించడం ఆనందంగా ఉందని పవన్ కల్యాణ్ అన్నారు. మారుమూల పల్లెలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేయడం ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. రోడ్లు, వంతెనల నిర్మాణంలో నాణ్యతతో పాటు నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయడంపై అధికారులు దృష్టి పెట్టనున్నారు.

**భరతమాతకు ధైర్యవంతుడైన కుమారుడు ఖుదీరామ్ బోస్: పవన్ కల్యాణ్**

స్వాతంత్ర్య సమరయోధుడు ఖుదీరామ్ బోస్ జయంతి సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నివాళులర్పించారు. కేవలం 18 ఏళ్ల వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ఖుదీరామ్ బోస్ ప్రాణత్యాగం చేశారన్నారు. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా భయంలేకుండా పోరాడిన వీరుడు ఖుదీరామ్ బోస్ అంటూ కొనియాడారు. ఆయన ధైర్యం, దేశభక్తి.. యువతకు నేటికీ ఆదర్శమని వ్యాఖ్యానించారు. స్వతంత్ర భారతాన్ని చూడలేక పోయినా.. ఆయన త్యాగం స్వాతంత్ర్యానికి బలమైన పునాదిగా నిలిచిందని పవన్ పేర్కొన్నారు. మాతృభూమిపై ప్రేమకు వయసుతో సంబంధం లేదని ఖుదీరామ్ బోస్ జీవితం చాటిచెబుతోందన్నారు. దేశ యువతలో ధైర్యం, దేశభక్తి, మాతృభూమిపై అంకితభావాన్ని ఖుదీరామ్ బోస్ పేరు ఎల్లప్పుడూ ప్రేరేపిస్తుందని తెలిపారు. 'భరతమాతకు ధైర్యవంతుడైన కుమారుడు ఖుదీరామ్ బోస్. జై హింద్' అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

### నా ఓటు తొలగించి,
# ఆట మొదలుపెట్టారు



(మొదటిపేజీ తరువాయి)

తన ఓటర్ ఐడీ తిరిగి పొందేందుకు ఎలాంటి పత్రాలను సమర్పించాలో కూడా తనకు తెలియదని అన్నారు. ఈ మొత్తం వ్యవహారాన్ని ''పెద్ద జోక్'' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ''నా ఓటర్ ఐడీని తిరిగి పొందడానికి నేను ఏ పత్రాలను చూపించాలో చూస్తాను. ఆట మొదలైంది, తమ శక్తిని ప్రదర్శించడానికి వారు ఇవన్నీ చేయగలరు. నా ఓటు హక్కును వాళ్లు ఆపగలరు, కానీ నన్ను ఆపగలరా?'' అంటూ ప్రశ్నించారు.

ప్రకాష్‌రాజ్ ఓటు హక్కుకు సంబంధించిన వివాదాలు ఉన్నాయి. గత జూన్ నెలలో బెంగళూర్ కోర్టు ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. 2019లో న్యాయవాది దిలీప్ కుమార్ హలసూర్ గేట్ పోలీస్ స్టేషన్‌లో ప్రకాష్ రాజ్‌పై ఫిర్యాదు చేశారు. కర్ణాటక, తమిళనాడు, తెలంగాణతో పాటు నాలుగు రాష్ట్రాల్లో ఆయనకు ఓటు హక్కు ఉందని, ఇది ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఓటర్ల ప్రక్షాళన ప్రక్రియలో ఆయన పేరును ఓటర్ల జాబితా నుంచి తొలగించడంపై ప్రకాష్ రాజ్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. తన ఓటు హక్కును తిరిగి పొందేకు అవసరమైన పత్రాలనను సమర్పిస్తానని తెలిపారు.

# అమెరికాలో ఏపీ టెక్కీ మృతి

**అమరావతి, ఆగస్ట్ 11 అనంత జనశక్తి న్యూస్**

అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 26 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దిలీప్ కుమార్ బుంగటావుల మృతి చెందారు. ఎదురుగా వస్తున్న పికప్ ట్రక్, ఆయన ప్రయాణిస్తున్న కారును ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. దిలీప్‌ది కడప జిల్లా బెట్టివారిపట్టి గ్రామం. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన ఆయన అక్కడి కెంట్ స్టేట్ యూనివర్సిటీలో మాస్టర్స్ చేశారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఓహియో రాష్ట్రంలోని మాసిడోనియా ప్రాంతంలో ఇంటర్ స్టేట్ 480 రోడ్డుపై ఈ ప్రమాదం జరిగింది. దిలీప్ కుమార్ ప్రయాణిస్తున్న సెడాన్ కారును అదే సమయంలో ఎదురుగా వస్తున్న పికప్ ట్రక్ ఢీకొట్టింది. ప్రమాదం గురించి తెలుసుకున్నా ఎమర్జెన్సీ సేవల బృందం ప్రమాదస్థలికి చేరుకునేలోపే దిలీప్ మరణించారు. ఈ ప్రమాదంలో మరో ముగ్గురు గాయపడ్డారు. వీరిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి దారి తీసిన పరిస్థితులపై యూఎస్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దిలీప్ కుమార్ మృతిని న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ జనరల్ ధ్రువీకరించింది. ఆయన కుటుంబానికి అన్ని విధాలుగా సాయం అందిస్తామని ప్రకటించింది. మరోవైపు, దిలీప్ కుమార్ కుటుంబానికి సాయం చేయడానికి నార్త్ అమెరికా తెలుగు సొసైటీ నిధులు సేకరిస్తోంది. దిలీప్ తండ్రి శ్రీహరి సాధారణ రైతు. దిలీప్ కుమార్ ఇటీవలే తన మాస్టర్స్ పూర్తి చేసి ఓ సాఫ్ట్ వేర్ కంపెనీలో ఉద్యోగంలో చేరినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని భారత్ తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

### ఆక్వా రైతులకు
# మళ్ళీ తీపి కబురు

**అమరావతి, ఆగస్ట్ 11, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆక్వా రైతులకు మళ్ళీ ఒక ఆ తీపి కబురు అందించింది. పరిశ్రమలోని రైతులపై విద్యుత్ భార భారాన్ని తగ్గించే లక్ష్యంతో యూనిట్ విద్యుత్‌ను కేవలం రూ. 1.50కే అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ఇంధన శాఖ అధికారికంగా జీవోను విడుదల చేసింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 6,500కి పైగా ఆక్వా ఫారాలకు ప్రత్యక్షంగా లబ్ధి చేకూరనుంది. ఆక్వా రంగంలో సాగు ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్న తరుణంలో.. ఈ విద్యుత్ సబ్సిడీ రైతులకు ఎంతో ఉపశమనాన్ని ఇస్తుంది. సాగు వ్యయాన్ని తగ్గించడం ద్వారా ఉత్పత్తి పెరగడమే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్‌లో మన ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులు మరింత విస్తరించేందుకు ఆస్కారం లభిస్తుంది.

రాష్ట్రంలో ఆక్వా రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలు ప్రోత్సాహక చర్యలను చేపడుతోంది. అందులో భాగంగానే ఇప్పుడు విద్యుత్ ఛార్జీల తగ్గించి రైతులకు అండగా నిలిచింది. కరెంట్ కష్టాల నుంచి ఉపశమనం లభించడంతో ఆక్వా రంగానికి సరికొత్త ఉత్తేజం లభించనుంది. ఉత్పాదకత పెరిగి, రైతులకు మంచి ఆదాయం సమకూరుతుందని ఆశిస్తున్నారు.

# కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడింది

**అమరావతి, ఆగస్ట్ 11, అనంత జనశక్తి న్యూస్**

జార్ఖండ్‌లో పది పరీక్షలో అవకతవకలు జరిగినట్లు తేలిందని.. ఈ క్రమంలోనే విద్యార్థులు ఆందోళన చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. వారిపైనా రబ్బర్ బుల్లెట్స్, లాఠీఛార్జి చేశారన్నారు. JJM, కాంగ్రెస్ ప్రభుత్వమే అక్కడ నడుస్తోందని చెప్పారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ అయినట్లు తెలిసిన వెంటనే పరీక్ష రద్దు చేశామని, పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేశారని వెల్లడించారు. బీజేపీ ప్రభుత్వానికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న తేడా ఇదే అని చెప్పుకొచ్చారు.

జార్ఖండ్‌లో ఎస్ఎస్‌సీ పేపర్ లీక్ వల్ల ఎంతో మంది యువత జీవితం రోడ్డుపాలవుతోందని మాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందన్నారు. కేంద్రంలో తప్పు జరిగిందని.. వెంటనే దాన్ని కరెక్ట్ చేశామని అన్నారు. రాహుల్ గాంధీ పిరికివారని.. అందుకే పార్లమెంట్‌కు రాకుండా పారిపోతున్నారని విమర్శించారు. పేపర్ లీక్‌పై చర్చించడానికి సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. వైఎస్సార్ హయాంలో జరిగిన పేపర్ లీకేజీలపై జగన్, షర్మిల ముందుకు రావాలన్నారు. వైసీపీ దిక్కుతోచని స్థితిలో ఉందంటూ వ్యాఖ్యానించారు. డీఎస్సీ పూర్తి పారదర్శకంగా జరిగిందని.. ఏం చేయాలో తెలియక వైసీపీ కావాలని రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. క్రీడా కోటాలో ఉద్యోగాలపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చిందని బీజేపీ ఏపీ అధ్యక్షుడు అన్నారు. వైసీపీ చేస్తున్న నిరసనలను ప్రజలు ఛీత్కరించుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రాజశేఖర్ రెడ్డి హయాంలో చేసినట్లు, తమ జీవితాలను నాశనం చేయొద్దని ఉద్యోగులు కూడా ఆందోళన చేశారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని.. విశాఖలో అత్యధిక స్థానాల్లో కూటమి ప్రభుత్వం గెలుస్తుందని పీవీఎన్ మాధవ్ ధీమా వ్యక్తం చేశారు.

### హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా
# తీర్చిదిద్దడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

హెచ్ఐవీ బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందించడంపై ప్రత్యేక దృష్టి సారించామని మంత్రి తెలిపారు. హెచ్ఐవీ ఇతరులకు, ముఖ్యంగా పుట్టబోయే శిశువులకు సంక్రమించకుండా అవగాహన కల్పిస్తున్నామన్నారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ నిర్మూలన ప్రచారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'బి పాజిటివ్ టు స్టాప్ హెచ్ఐవీ పాజిటివ్' నినాదంతో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. తెలంగాణను హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. కాగా.. రేపు ఈ ర్యాలీని మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్.. జెండా ఊపి ప్రారంభించనున్నారు. కాలేజీ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు ర్యాలీలో పాల్గొననున్నారు.

### తమిళం నేర్పలేనిది
# క్రైస్తవ మతం నేర్పింది

**చెన్నై, ఆగస్ట్ 11, అనంత జనశక్తి న్యూస్**

తమిళనాడు ఆర్థిక మంత్రి ఎన్ మేరీ విల్సన్ చేసిన వ్యాఖ్యలు ఆ రాష్ట్రంలో రాజకీయంగా వివాదానికి దారితీశాయి. ''తమిళ భాషను ఎంత చదివినా కొందరు అర్థం చేసుకోలేని విషయాలను క్రైస్తవ మతం తనకు నేర్పింది'' అని ఆయన అసెంబ్లీలో వ్యాఖ్యానించారు. దీనిపై బీజేపీ తీవ్ర విమర్శలు చేస్తూ.. తమిళ భాషను కించపరిచొద్దని వార్నింగ్ ఇచ్చింది. బడ్జెట్ ప్రసంగంలో మంత్రి తమిళ భాషను సరిగా మాట్లాడలేదని, వ్యాకరణపరమైన తప్పులు ఉన్నాయని ఎండీఎంకే ఎమ్మెల్యే టీఎం రాజేంద్రన్ విమర్శించారు. భవిష్యత్తులో అసెంబ్లీలో మాట్లాడే అవకాశం వస్తే తప్పులు లేకుండా తమిళంలో మాట్లాడాలని అన్నారు.

క్రైస్తవ మతం తనకు ప్రేమ భాష, శాంతి భాష, కరుణ భాష నేర్పిందని విల్సన్ అన్నారు. ఎంతగా తమిళాన్ని



అధ్యయనం చేసినా కొందరు ఈ విలువలను అర్థం చేసుకోలేరని వ్యాఖ్యానించారు. తాను బైబిల్ చదివానని, పుట్టుకతోనే క్రైస్తవుడినని అన్నారు. తన ప్రాధాన్యత తమిళ భాషకు సంబంధించిన విమర్శలు కావని, తమిళ పాలన, రాష్ట్రాభివృద్ధికి సంబంధించినవని అన్నారు. తాను మాట్లాడే శైలిని, వ్యక్తిత్వాన్ని విమర్శిస్తూ కొందరు ఎగతాళి చేస్తున్నారని ఆరోపించారు.

మంత్రి వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ తీవ్రంగా స్పందించారు. వ్యక్తిగత మత విశ్వాసాల గురించి మాట్లాడే క్రమంలో తమిళ భాషను కించపరిచేలా మంత్రి మాట్లాడారని ఆరోపించారు. ఆయన మతం నేర్పిన విషయాల గురించి అభ్యంతరం లేదని, కానీ తమిళాన్ని ఎందుకు కించపరిచారని విమర్శించారు. తమిళభాషను మతంలో పోల్చడం, మతం కన్నా తక్కువగా చూపించే ప్రయత్నం మంచిది కాదని, విల్సన్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని నాగేంద్రన్ డిమాండ్ చేశారు.

బీజేపీ నేత వినోజ్ పి. సెల్వం విల్సన్ వ్యాఖ్యల్ని విమర్శించారు. టీవీకేను క్రైస్తవ ముఖ్యమంత్రి నడిపిస్తున్న క్రైస్తవ పార్టీగా అభివర్ణించారు. ఆ పార్టీ పూర్తిగా తమ మత విశ్వాసాలు, వ్యవస్థను తమిళ సంస్కృతిలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి విజయ్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. మరోవైపు, తమిళ బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు మంత్రి విల్సన్ క్రాస్ గుర్తు గీసిన వీడియో సోషల్ మీడియాలో వైరలైంది.

# పాతబస్తీ మెట్రోకు వేగం

(మొదటిపేజీ తరువాయి)

**మరోవైపు.. హైదరాబాద్ మెట్రో రైళ్లలో రోజురోజుకూ పెరుగుతున్న ప్రయాణికుల రద్దీపై కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రస్తుతం ఉన్న రైళ్ల సామర్థ్యానికి అదనంగా కొత్త కోచ్‌లను కొనుగోలు చేసి.. వాటిని మెట్రో రైళ్లకు జత చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన కొనుగోలు ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. పీక్ అవర్స్‌లో ప్రయాణికుల రద్దీని తగ్గించడంతో పాటు మెట్రో సేవల సామర్థ్యాన్ని పెంచేందుకు అదనపు కోచ్‌లు కీలకంగా మారనున్నాయి. నగరంలో మెట్రోకు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందుగానే చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.**



# ఆస్తుల విషయంలో ప్రజలు ఆందోళన వద్దు

(మొదటిపేజీ తరువాయి)

కొత్తగా తమ ప్రభుత్వం ఎలాంటి భూములను నిషేధిత జాబితాలో చేర్చలేదని వెల్లడించారు. 22ఏ, పీఓబీ అంశంపై మంగళవారం సచివాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు.. జిల్లా రిజిస్ట్రార్లు, సబ్ రిజిస్ట్రార్లతో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను జిల్లాల వారీగా పరిశీలించారు. అర్హులైన బాధితులకు వీలైనంత త్వరగా ఊరట కల్పించాలని అధికారులను పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. భూముల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లేఅవుట్ అనుమతులు సహా అన్ని రికార్డులను ఈనెల 14వ తేదీలోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

ఈ విధానం ద్వారా బోగస్ లేదా ఫోర్జరీ పత్రాలను గుర్తించడంతో పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మరింత పారదర్శకత తీసుకురావచ్చని మంత్రి చెప్పారు. పహాణీలను కూడా సబ్ రిజిస్ట్రార్లకు అందుబాటులో



ఉంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నిషేధిత జాబితాలోని ఆస్తుల రిజిస్ట్రేషన్ దరఖాస్తులను సబ్ రిజిస్ట్రార్లు గుడ్డిగా తిరస్కరించకూడదని పొంగులేటి స్పష్టం చేశారు. ఏదైనా దరఖాస్తును తిరస్కరించాల్సిన పరిస్థితి ఉంటే కారణాలను పరిశీలించేందుకు 3 రోజుల సమయం తీసుకుని.. స్పష్టమైన వివరణ ఇవ్వాలని సూచించారు. ప్రతి కేసును విడివిడిగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని ఆదేశించారు.

ఇకపై నిషేధిత జాబితాకు సంబంధించిన దరఖాస్తులను తహసీల్దార్లకు పంపకుండా నేరుగా జిల్లా కలెక్టర్లకు పంపించాలని మంత్రి పొంగులేటి నిర్ణయించారు. కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్ స్థాయిలోనే సంబంధిత వ్యవహారాలను సమన్వయం చేయాలని సూచించారు. సబ్ రిజిస్ట్రార్ల విచక్షణాధికారాలను పరిమితం చేసి.. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న ధ్రువీకరించిన వివరాల ఆధారంగానే రిజిస్ట్రేషన్‌పై నిర్ణయం తీసుకునే విధంగా వ్యవస్థను రూపొందించాలని అధికారులను పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు.

ప్రభుత్వ భూములు, ఆస్తుల పరిరక్షణ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ ఉండదని మంత్రి పొంగులేటి తేల్చి చెప్పారు. అదే సమయంలో 22ఏ నిబంధనల పేరుతో చట్టబద్ధంగా హక్కు ఉన్న పేదలు, సాధారణ ప్రజలకు అన్యాయం జరిగితే సహించబోమని స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగా తప్పులు చేసే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజావాణి, కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లకు వచ్చిన 22ఏ, పీఓబీ దరఖాస్తులను ప్రతిరోజూ సమీక్షించాలని కలెక్టర్లను ఆదేశించారు. సమస్య వచ్చిన తర్వాత పరిష్కరించడం కంటే ముందుగానే లోపాలను గుర్తించి ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడటం అధికారుల బాధ్యత అని సూచించారు.

# చరిత్రలోనే తొలిసారి.. స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఎర్రకోటపై వందేమాతరం ఆలాపన



దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోట వేదికగా ఆగస్టు 15న జరగనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఒక చారిత్రక ఘట్టానికి సాక్ష్యంగా నిలవనున్నాయి. ఈ గేయం రూపుదిద్దుకుని 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా మొట్టమొదటి సారి 'వందేమాతరం' గీతాలాపన చేయాలని కేంద్రం నిర్ణయించింది. అయితే ప్రధాని మోదీ వస్తుండగా ఈ జాతీయ గేయాన్ని పాడనున్నారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో యువత భాగస్వామ్యమే ప్రధాన థీమ్‌గా ఈ ఏడాది వేడుకలను నిర్వహించనున్నారు.

దేశ రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోట ప్రాంగణం ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఒక అపూర్వమైన ఘట్టానికి సాక్ష్యంగా నిలవబోతోంది. భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో భాగంగా తొలిసారిగా జాతీయ గేయం 'వందేమాతరం'ను ఎర్రకోట వద్ద ఆలపించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోటకు చేరుకునే సమయంలో ఈ గీతాలాపన జరుగుతుందని.. అనంతరం ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తారని రక్షణ శాఖ వెల్లడించింది.

**150 ఏళ్ల ఘన చరిత్రకు నివాళి!**

ఈ వినూత్న నిర్ణయం వెనుక ఉన్న విశేషాలను రక్షణ కార్యదర్శి ఆర్.కె. సింగ్ వివరించారు. ప్రముఖ బెంగాలీ రచయిత బంకిం చంద్ర ఛటర్జీ రచించిన 'వందేమాతరం' గీతం రూపుదిద్దుకుని 2026 నాటికి సరిగ్గా 150 సంవత్సరాలు పూర్తి అవుతోంది. ఈ సందర్భంగా ఆ అమర గీత వారసత్వానికి, ప్రాముఖ్యతకు ఘన నివాళిగా ఎర్రకోట బురుజుల నుంచి దీనిని ఆలపించాలని నిర్ణయించారు. సాధారణంగా ఈ గేయంలోని మొదటి రెండు చరణాలను మాత్రమేఆలపించే సాంప్రదాయం ఉండేది. అయితే జాతీయ గీతం 'జనగణమన'తో సమానంగా వందే మాతరానికి గౌరవం దక్కాలని, అందులోని మొత్తం ఆరు చరణాలను ఆలపించాలని కేంద్ర ప్రభుత్వం చాటి చెబుతోంది. ఇటీవలే వందేమాతరాన్ని అవమానించడాన్ని నేరంగా పరిగణిస్తూ పార్లమెంటు ఒక బిల్లును ఆమోదించింది. అలాగే ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల ప్రారంభంలో ప్రాధాన్యతగా వందేమాతరం పాటించాలని కేంద్రం ఆదేశించడమే కాకుండా పలు రాష్ట్రాలు పాఠశాలల్లో దీనిని నిర్బంధం చేశాయి. అయితే ఈ గీతంలోని కొన్ని చరణాలు తమ మత విశ్వాసాలకు విరుద్ధంగా ఉన్నాయని పేర్కొంటూ కొన్ని ముస్లిం సంస్థలు పూర్తి గీతాన్ని ఆలపించడంపై అభ్యంతరం వ్యక్తం చేశాయి.

**'వికసిత్ భారత్ 2047'.. యువతదే కీలక పాత్ర!**

2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడంలో యువత అందిస్తున్న సహకారాన్ని గౌరవిస్తూ ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవానికి ప్రత్యేక థీమ్‌ను ఖరారు చేశారు. ఇటీవల ప్రశ్నపత్రాల లీకేజీలపై జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన భారీ నిరసనల నేపథ్యంలో ఈ థీమ్ ఎంచుకున్నారా అని అడిగిన ప్రశ్నకు రక్షణ కార్యదర్శి స్పష్టత ఇచ్చారు. జంతర్ మంతర్ ఆందోళనల కంటే ముందే యువత పాత్రను వేడుకల్లో ప్రముఖంగా చాటాలనే ప్రణాళిక సిద్ధమైందని ఆయన తెలిపారు. 2047 నాటి వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత భాగస్వామ్యం, వారి పురోగతి ఎంతో కీలకమని.. అందుకే ఈ థీమ్‌ను రూపొందించామని వెల్లడించారు. భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసి, ప్రధాని మోదీ నాయకత్వంలో 80వ స్వాతంత్ర్య వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు.

వందేమాతరం పాటలో కొన్ని చరణాలపై ముస్లిం సంస్థల అభ్యంతరాల సరైనవే అని మీరు భావిస్తున్నారా? మీ అభిప్రాయాన్ని కామెంట్ బాక్స్‌లో పంచుకోండి.

# "అమ్మాయిలు జీన్స్ వేసుకుంటే అల్లరి చేస్తారా?":

**- వేధింపుల కేసులో ట్రయల్ కోర్టుపై ఢిల్లీ హైకోర్టు ఫైర్**

యువతుల వస్త్రధారణ వారి వ్యక్తిగత హక్కు అని, వారు జీన్స్ ధరించడం వల్లే యువకులు వేధింపులకు పాల్పడుతున్నారనడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. 2013 నాటి వేధింపుల కేసులో నిందితుడిని నిర్దోషిగా తేల్చిన ట్రయల్ కోర్టు తీర్పును రద్దు చేస్తూ.. జస్టిస్ చంద్రశేఖరన్ సుధ అతడిని దోషిగా నిర్ధారించారు. అమ్మాయిల దుస్తులను కాకుండా మగపిల్లల ప్రవర్తనను సరిదిద్దడంపై సమాజం, తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని హితవు పలికారు.

మహిళల హక్కులు, వారి వ్యక్తిగత స్వేచ్ఛపై ఢిల్లీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. యువతులు ఎలాంటి దుస్తులు ధరించాలనేది పూర్తిగా వారి ఇష్టానికి, స్వేచ్ఛకు సంబంధించిన అంశమని న్యాయస్థానం తేల్చిచెప్పింది. అమ్మాయిలు జీన్స్ వంటి వస్త్రాలు ధరించడమే యువకులు వారి పట్ల దుష్ప్రవర్తనతో మెలగడానికి కారణం అవుతుందని భావించడం ఎంతో విచారకరమని, అసలు ఆ తరహా ఆలోచనా ధోరణి సమాజంలో ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ధర్మాసనం స్పష్టం చేసింది.

**ట్రయల్ కోర్టు వైఖరిపై తీవ్ర ఆగ్రహం..**

2013లో చోటుచేసుకున్న ఒక ఈవ్‌టీజింగ్, అసభ్య ప్రవర్తన కేసును విచారించిన జస్టిస్ చంద్రశేఖరన్ సుధ ఈ సంచలన తీర్పును వెలువరించారు. తన పొరుగింట్లో నివసించే వ్యక్తి తనను నిరంతరం వేధిస్తున్నాడని, అంతేకాకుండా తన శరీరాన్ని తాకుతూ అత్యంత అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఒక మైనర్ బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసును విచారించిన కింది స్థాయి ట్రయల్ కోర్టు.. నిందితుడిపై ఉన్న ఆరోపణలను కొట్టివేస్తూ అతడిని నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పును ఇచ్చింది. ముఖ్యంగా ఆ సమయంలో అమ్మాయి నడవడిక, వస్త్రధారణపై న్యాయస్థానం షాకింగ్ కామెంట్లు చేసింది.

**అబ్బాయిల ప్రవర్తనను సరిదిద్దాలి..!**

ట్రయల్ కోర్టు ఇచ్చిన ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఢిల్లీ ప్రభుత్వం హైకోర్టులో అప్పీలు దాఖలు చేసింది. ఈక్రమంలోనే విచారణ చేపట్టిన న్యాయస్థానం.. కింది కోర్టు వ్యవహరించిన తీరుపై జస్టిస్ చంద్రశేఖరన్ సుధ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విచారణ సమయంలో బాధిత బాలిక నడవడికను, ఆమె వస్త్రధారణను తప్పుపట్టేలా ప్రశ్నించడాన్ని, అలాగే సదరు ప్రాంతంలోని ఆమె వర్గానికి చెందిన వారిని కించపరిచేలా మాట్లాడటంపై హైకోర్టు తీవ్రం ఆగ్రహం వ్యక్తం చేసింది. అమ్మాయిలు ఎలాంటి బట్టలు వేసుకున్నా వారిని తప్పు పట్టకూడదని.. ఇలాంటి నడవడికను తల్లిదండ్రులే అబ్బాయిలకు నేర్పించాలని స్పష్టం చేసింది. అంతేకాకుండా ట్రయల్ కోర్టు దోషిగా నిర్ధారించిన నిందితుడిని.. దోషిగా తేలుస్తూ హైకోర్టు సంచలన తీర్పును వెలువరించింది.




# రణరంగమైన రాంచీ

నీట్ పేపర్ లీక్‌కు నిరసనగా విద్యార్థులు గత నెలలో చేపట్టిన 'చలో పార్లమెంటు' ర్యాలీపై పోలీసుల బలప్రయోగంతో దిల్లీ రణరంగమైన ఉదంతాన్ని మరువకముందే.. ఝార్ఖండ్ రాజధాని రాంచీలో సోమవారం అలాంటి పరిణామం చోటుచేసుకుంది. ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలను నిరసిస్తూ అసెంబ్లీని ముట్టడించేందుకు ఝార్ఖండ్ విద్యార్థులు, ఉద్యోగార్థులు చేపట్టిన ర్యాలీ తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. వారిని నిలువరించేందుకు పోలీసులు జల ఫిరంగులను ప్రయోగించారు. లాఠీఛార్జి కూడా చేశారు. దీంతో అనేక మంది గాయపడ్డారు. వారిలో పలువురు విద్యార్థినులూ ఉన్నారు. కాంగ్రెస్ భాగస్వామిగా ఉన్న ఝార్ఖండ్ ముక్తిమోర్చా (జేఎంఎం) నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో అక్రమాలపై విద్యార్థులు, ఉద్యోగార్థులు 17 రోజులుగా ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. రాంచీలో అసెంబ్లీని ముట్టడించేందుకు వారు సోమవారం వేలాదిగా తరలివచ్చారు. పటిష్ఠ భద్రతా ఏర్పాట్లను దాటుకుంటూ.. శాసనసభకు దాదాపు 200 మీటర్ల దూరంలోని జగన్నాథ్‌పుర్ ఆలయ బారికేడ్ వరకు దూసుకొచ్చారు. వారిని నియంత్రించేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలు, జలఫిరంగులు ప్రయోగించారు. లాఠీఛార్జి చేశారు. ఉద్యోగ పరీక్షల్లో అవకతవకలకు వ్యతిరేకంగా 9 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న జేఎల్‌కేఎం నేత దేవేంద్రనాథ్ మహతో.. అంబులెన్సులో ఉండి అసెంబ్లీ ముట్టడి ర్యాలీలో పాల్గొన్నారు. ఆయన ఝార్ఖండ్ మాజీ సీఎం శిబూ సోరెన్ (ప్రస్తుత ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తండ్రి) చిత్రపటాన్ని చేతిలో పట్టుకొని కనిపించారు. తమ గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంతో ప్రస్తుతం చర్చలు జరపబోమని మహతో స్పష్టం చేశారు. ర్యాలీ అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో ఆసుపత్రిలో చేర్పించారు. ఉద్రిక్తతల కారణంగా అసెంబ్లీ మధ్యాహ్నమే వాయిదా పడింది.



**జేపీఎస్సీ మాజీ ఛైర్‌పర్సన్ ఖియాంగ్తే అరెస్టు**

ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలకు సంబంధించి.. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్సీ) మాజీ ఛైర్‌పర్సన్ ఎల్ ఖియాంగ్తేను రాష్ట్ర సీఐడీ సోమవారం అరెస్టు చేసింది. ఈయన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. జేపీఎస్సీ ఛైర్‌పర్సన్‌గా నిరుడు ఫిబ్రవరిలో నియమితులయ్యారు. గత నెల 22న ఆ పదవికి రాజీనామా చేశారు. జేపీఎస్సీలోని మొత్తం ముగ్గురు సభ్యులూ (అజీతా భట్టాచార్య, ఎనీమా హన్స్‌దా, జమాల్ అహ్మద్) తమ పదవులకు ఆదివారమే రాజీనామా చేశారు.

ఝార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జేఎస్ఎస్సీ) సీజీఎల్ పరీక్షలో అవకతవకలకు సంబంధించి సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా రంగంలోకి దిగింది. ఈ వ్యవహారంలో నగదు అక్రమ చలామణి చట్టం (పీఎంఎల్ఏ) కింద దర్యాప్తు ప్రారంభించింది.

**రాహుల్.. పట్టించుకోరా?: భాజపా**

ఉద్యోగ పరీక్షల్లో అవకతవకలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తూ ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ నివాసం ఎదుట భాజపా నేతలు సోమవారం ధర్నా చేశారు. దిల్లీలో ఆందోళనలను సమర్థించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ... ఝార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనను ఎందుకు పట్టించుకోవటం లేదని భాజపా నిలదీసింది. విద్యార్థులపై పోలీసుల బలప్రయోగానికి నిరసనగా మంగళవారం రాష్ట్ర బంద్ పాటించాలని పిలుపునిచ్చింది.

**విద్యార్థులపై బలప్రయోగం తప్పు: రాహుల్**

ఝార్ఖండ్‌లో విద్యార్థులపై పోలీసుల బలప్రయోగాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తప్పుబట్టారు. విద్యార్థుల సమస్యలను ఆలకించి, వాటిని పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.

# 'పర్సన్' అంటే పిల్లలే కాదు: మిస్సింగ్ కేసులపై సుప్రీం దిగ్భ్రాంతి

ఒక వ్యక్తి తప్పిపోయారని సమాచారం అందగానే పోలీసులు వెంటనే కేసు నమోదు చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వయసు, లింగంతో సంబంధం లేకుండా అదృశ్యమైన వ్యక్తి విషయంలో తక్షణమే స్పందించాలని తేల్చిచెప్పింది. తాము గతంలో ఇచ్చిన ఆదేశాల్లో పేర్కొన్న 'పర్సన్' అనే పదం కేవలం పిల్లలకే పరిమితం కాదని తెలిపింది. తమ ఆదేశాలు పాటించని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ధిక్కార చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. ''పర్సన్ అనే పదం కేవలం పిల్లలకే వర్తిస్తుందని, పెద్దలకు కాదని కొన్ని రాష్ట్రాలు భావిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. అది తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాం. అది ఒక ఉద్దేశపూర్వక భ్రమ అని మేం భావిస్తున్నాం. మా గత ఉత్తర్వుల్లో ప్రస్తావించిన అంశాలు స్పష్టంగా ఉన్నాయి. 'వ్యక్తి' అనే పదానికి వయసు, లింగంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరని అర్థం'' అని సుప్రీం ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది.

తప్పిపోయిన వ్యక్తిని గుర్తించడానికి కావాల్సిన బృందాన్ని వెంటనే రంగంలోకి దించాలని స్పష్టం చేసింది. ఒక వ్యక్తి మిస్ అయిన తర్వాత తొలి గంటలు కీలకమని, ఆ సమయంలోనే పోలీసులు తక్షణం స్పందిస్తే.. వారిని గుర్తించే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయని పేర్కొంది. అలాగే ఆ వ్యక్తిని కాపాడిన వెంటనే ఎలాంటి జాప్యం లేకుండా కుటుంబ సభ్యులకు అప్పగించాలని సూచించింది.

# పంజాబ్‌లో రాజకీయ దుమారంరేపుతోన్న 'జాంబీ డ్రగ్'..!



జాంబీ డ్రగ్.. ఈ పదం పంజాబ్ (Punjab) రాజకీయాల్లో దుమారం రేపుతోంది. భాజపా రాజ్యసభ ఎంపీ, మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ చేసిన పోస్టుపై అధికార పార్టీ ఆమ్ ఆద్మీ విరుచుకుపడుతోంది. పంజాబ్ యువత మాదకద్రవ్యాల వ్యసనం బారిన పడటంపై హర్భజన్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్ర యువతను వ్యసనాలు చుట్టుముట్టాయని, వారిని కాపాడాలంటూ ఎక్స్ వేదికగా కోరారు. ''మన పంజాబ్‌పై ఎవరి కన్నో పడింది. ఇంతకాలం రాష్ట్రాన్ని పాలించిన ప్రభుత్వాలు వారిని నాశనం చేశాయి'' అంటూ కదలకుండా వంగిన స్థితిలో నిల్చున్న ఇద్దరు వ్యక్తుల దృశ్యాలను షేర్ చేశారు. దీనిపై పంజాబ్ పోలీసులు వెంటనే స్పందించారు. ఆ దృశ్యాలను రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్‌లో చిత్రీకరించారని స్పష్టం చేశారు. వెనక పంజాబీ పాట వినిపిస్తే.. అది ఆ వీడియో పంజాబ్‌లోనిది అవుతుందా..? ఇలా తప్పుదోవ పట్టించే కంటెంట్‌ను షేర్ చేసేముందు, పోలీసులకు ట్యాగ్ చేసేముందు సరిచూసుకోవాలని సోషల్ మీడియా ఖాతాదారుల్ని కోరుతున్నాం'' అని ఫ్యాక్ట్ చెక్ చేశారు.

**జాంబీ డ్రగ్ అంటే..?**

**జైలజీన్ . పశువులకు ఏమైనా చికిత్స చేసినప్పుడు వాడే ఒక పవర్‌ఫుల్ మత్తుమందు. మనుషులు ఉపయోగించడానికి అనుమతి లేదు. జైలజీన్, ఫెంటనిల్ మిశ్రమాన్ని జాంబీ డ్రగ్‌గా పిలుస్తుంటారు . ఇది తీసుకున్నవారు శారీరకంగా నియంత్రణ కోల్పోతారు. ఎటూ కదల్లేని స్థితిలో ఒక్కోసారి వంగిపోయి కనిపిస్తుంటారు. ఈ జాంబీ డ్రగ్‌కు విరుగుడులు ఏవీ పనిచేయవు. మామూలుగా డ్రగ్ ఓవర్ డోస్ అయినప్పుడు నాలోక్సోన్ ఇస్తుంటారు. కానీ జైలజీన్‌కు అది పనిచేయదు. కానీ ఫెంటనిల్ ప్రభావాన్ని మాత్రం కాస్త తగ్గిస్తుంది. దాంతో శ్వాస ఆడి ప్రాణాలు నిలుస్తాయని వైద్యులు చెప్తున్నారు.**

# మగవాళ్ల దుష్ప్రవర్తనకు యువతుల వస్త్రధారణ సాకు సరికాదు




: యువతుల వస్త్రధారణ వారి వ్యక్తిగత నిర్ణయమని దిల్లీ హైకోర్టు పేర్కొంది. 'వారు జీన్స్ ధరించడం యువకుల దుష్ప్రవర్తనకు కారణమవుతుందని చెప్పడం విచారకరం. ఆ తరహా ఆలోచనా ధోరణి ఆమోదయోగ్యం కాద'ని జస్టిస్ చంద్రశేఖరన్ సుధ తెలిపారు. 2013లో ఓ యువతిని వేధించిన వ్యక్తిని దోషిగా నిర్ధారిస్తూ న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. బాలికల వస్త్రధారణను నియంత్రించాలని ప్రయత్నించడానికి బదులు తల్లిదండ్రులు, సమాజం తమ పిల్లల నడవడికను నియంత్రించాలని సూచించారు. వ్యక్తులుగా వారికి ఉండాల్సిన హద్దులను గుర్తెరిగేలా చేయాలని తెలిపారు. పొరుగింటి వ్యక్తి తనను వేధించడంతో పాటు శరీరాన్ని తాకుతూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఓ బాలిక ఫిర్యాదు చేసింది. ఈ కేసులో ట్రయల్ కోర్టు నిందితుడిని నిర్దోషిగా ప్రకటించింది. దీనిని ప్రభుత్వం సవాల్ చేస్తూ దిల్లీ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. ట్రయల్ కోర్టులో విచారణ జరిగిన తీరును జస్టిస్ చంద్రశేఖరన్ సుధ తప్పుపట్టారు. బాలిక నడవడికను, వస్త్రధారణను నిందించేలా, ఆ ప్రాంతంలోని ఆమె వర్గం వారిని కించపరిచేలా ప్రశ్నించడాన్ని గర్హించారు. నిందితుడిపై కేసును కొట్టివేయడానికి ట్రయల్ కోర్టు చూపిన కారణాలను తోసిపుచ్చారు.

# నీట్ రద్దు చేయాలి: అసెంబ్లీలో విజయ్ ప్రభుత్వం తీర్మానం



వైద్య కోర్సుల్లో ప్రవేశాలు పొందడానికి జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్ ప్రవేశ పరీక్షను తొలినుంచీ తమిళనాడు వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీలో నీట్‌కు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఆరోగ్యశాఖ మంత్రి కె.అరుణ్‌రాజ్ మంగళవారం ఈ తీర్మానాన్ని తీసుకువచ్చారు. దీనికి ప్రధాన విపక్షాలైన డీఎంకే, ఏఐఏడీఎంకే మద్దతు తెలిపాయి. టీవీకేకు మిత్రపక్షాల నుంచి ఎలాగూ మద్దతు ఉంది. ఒక్క భాజపా మాత్రం సభ నుంచి వాకౌట్ చేసింది.

తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సందర్భంగా ఆరోగ్య మంత్రి అరుణ్‌రాజ్ మాట్లాడారు. ''కేంద్ర ప్రభుత్వం నీట్‌ను రద్దు చేయాలి. ఈ ప్రవేశ పరీక్షవల్ల విద్యార్థుల దృష్టి కోచింగ్ సెంటర్ల వైపు మళ్లింది. ఫీజులు భారీగా వసూలు చేసే కోచింగ్ సెంటర్లు పెరిగిపోయాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని, సామాజికంగాఆర్థికంగా వెనకబడిన విద్యార్థుల అవకాశాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి'' అని ఆందోళన వ్యక్తంచేశారు. సామాజిక న్యాయం, సమానత్వం, రాష్ట్రాల హక్కులకు ఈ పరీక్ష వ్యతిరేకం అనే విషయాన్ని తమిళనాడులోని ప్రతి ప్రభుత్వం వాదిస్తోన్న విషయాన్ని గుర్తుచేశారు. 12వ తరగతి మార్కుల ఆధారంగా వైద్య కోర్సుల్లో ప్రవేశం ఉండాలని విజయ్ ప్రభుత్వం ప్రతిపాదించింది. గతంలో డీఎంకే ఇదే ప్రతిపాదన చేసిన సంగతి తెలిసిందే.

నీట్ పేపర్ లీక్ అంశాన్ని కూడా తమిళనాడు ప్రభుత్వం తీర్మానంలో ప్రస్తావించింది . విద్యార్థుల ఆత్మహత్యలకు ఈ పరీక్ష ఒత్తిడి కారణమని పేర్కొంది. నీట్ రద్దుతోనే వాటికి ముగింపు వస్తుందని అభిప్రాయపడింది.

# పార్లమెంట్ ఎదుట పోటాపోటీ నిరసనలు..







అధికార, విపక్షాల నిరసనలతో పార్లమెంట్ ప్రాంగణంలో కొంతసేపు గందరగోళం నెలకొంది. దిల్లీలో నిరసనకారులపై పోలీసుల దాడి గురించి హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో మాట్లాడాలని.. అయోధ్య రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. మరోవైపు ఝార్ఖండ్‌లో విద్యార్థులపై పోలీసుల లాఠీ ఛార్జీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడాలని భాజపా ఎంపీలు నినాదాలు చేశారు. దిల్లీ విషయంలో మీడియాలో చర్చలు జరిపిన రాహుల్ ఝార్ఖండ్ విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.

ఇరువర్గాల పోటాపోటీ నిరసనలతో పార్లమెంట్ ఆవరణలో గందరగోళం నెలకొంది. మరోవైపు లోక్‌సభలో చర్చలు జరుగుతుండగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించడంతో స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్థవంతమైన చర్చలు జరపాలని హితవు పలికారు. ప్రతిపక్షాల నినాదాల మధ్య సభ రేపటికి వాయిదా పడింది.

వర్షాకాల సమావేశాలు మొదలైనప్పటి నుంచి పార్లమెంట్‌లో వాయిదాల పర్వం కొనసాగుతోంది. సమావేశాలు తుదిదశకు చేరుకుంటుండటంతో.. అధికార విపక్షాల మధ్య రాజకీయ పంతం మరింత పెరిగింది. జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలు, పోలీసు చర్యపై విపక్షాలు కోరినట్లుగా... హోంమంత్రి అమిత్‌షా సభలో సమాధానం ఇవ్వటానికి సిద్ధమని కేంద్రం సోమవారం ప్రకటించగా... ఊరికే ప్రసంగాలు కాదు... మేం అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మెలిక పెట్టారు.

# కేరళం.. పేరు మార్పు బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా (Keralam) మార్చేందుకు తీసుకొచ్చిన చట్టసవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. దీంతోపాటు నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చట్టసవరణ బిల్లుకు కూడా సభ ఆమోదం లభించింది. దిల్లీలో నిరసనకారులపై పోలీసుల దాడి గురించి హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌కు వచ్చి సమాధానం ఇవ్వాలని సభలో విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. ఈ నినాదాల మధ్యే ఈ రెండు బిల్లులను కేంద్రం ప్రవేశపెట్టగా.. ఎటువంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో అవి ఆమోదం పొందాయి. అనంతరం సభ బుధవారానికి వాయిదా పడింది.**



# నెగ్గాల్సిన ఇతర పరీక్షలు

యాభై రోజులుపైగా ఢిల్లీలో మహోధృతంగాసాగి, దేశం మొత్తాన్ని సుడిగాలిలా చుట్టేసిన జంతర్ మంతర్ ఉద్యమం ఉపశమించిన మర్నాడే ప్రధాని నరేంద్ర మోదీ పరీక్షల సంస్కరణల కోసం ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నిలేకని ఆధ్వర్యాన ఆరుగురు సభ్యుల టాస్క్‌ఫోర్స్ కమిటీని నియమిస్తున్నట్టు ఆదివారం ప్రకటించారు. అంతేకాదు... పరీక్షల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు పబ్లిక్ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) సవరణ బిల్లును లోక్‌సభలో సోమవారం ప్రవేశపెట్టారు. కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో మొదలెట్టి చకచకా సాగుతున్న ఈ పరిణామాలు... ఆగ్రహంతో రగులుతున్న జెన్ జీ తరాన్ని దగ్గర చేసుకోవటానికి కేంద్రం చేస్తున్న ప్రయత్నాల పర్యవసానమే. నీట్ పేపర్ లీకయిందనీ, మరోసారి ఆ పరీక్ష నిర్వహణ తప్పదనీ తేలిన వెంటనే ఇంతే వేగంగా స్పందించివుంటే బహుశా ఈ స్థాయిలో ఆందోళన జరిగివుండేది కాదేమో! ఆ మాటకొస్తే ఎన్నో యేళ్లుగా ఈ లీకులు వినబడుతూనే ఉన్నాయి. కానీ వ్యవస్థల్లో కదలిక లేదు. 2024 నీట్ ప్రశ్నపత్రం లీక్ తర్వాత మాత్రం ఇస్రో మాజీ చైర్మన్ డాక్టర్ కె. రాధాకృష్ణన్ నేతృత్వంలో ఒక కమిటీ ఏర్పాటైంది. అది ఇచ్చిన నివేదిక అతీగతీ ఏమైందో తెలియదు. ఇంత నిస్తేజంగా ప్రభుత్వాలున్నప్పుడు ఉద్యమాలు వెల్లువెత్తడంలో ఆశ్చర్యం లేదు.

మన దేశంలో సమస్యేమంటే కేంద్రం ఒక్కటే కాదు... రాష్ట్ర ప్రభుత్వాలు సైతం లీకుల విషయంలో నిర్లిప్తంగానే ఉంటాయి. జంతర్ మంతర్ ఉద్యమం ఒకపక్క సాగుతుండగానే పంజాబ్‌లో ఫార్మసీ రిక్రూట్‌మెంట్ పరీక్షల అక్రమాలు బయటపడ్డాయి. ఇక ఎన్డీయే కూటమి ఏలుబడిలోనే సాగుతున్న ఆంధ్రప్రదేశ్‌లో ఏకంగా ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియే పెద్ద కుంభకోణంగా మారింది. నోటిఫికేషన్ విడుదలనాడే స్పోర్ట్స్ కోటా నియామకాలకు అర్హత పరీక్ష అవసరం లేదంటూ రెండు జీవోలు తీసుకురావటం ఆ ప్రభుత్వ బరితెగింపునకు చిహ్నం. అందుకే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం ఏపీ విద్యామంత్రి లోకేశ్ రాజీనామా చేయాలన్న డిమాండ్ బలంగా వినిపించింది.

నందన్ నిలేకని విద్యాధికుడు. ఐటీ రంగంలో పేరెన్నికగన్నవారు. గతంలో మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలోని యూపీఏ ప్రభుత్వం దేశంలో సంక్షేమ పథకాల అమలుకోసమంటూ తీసుకొచ్చిన ఆధార్ కార్డుల రూపకర్త ఆయనే. నిలేకని మాదిరే ఇతర సభ్యులు సైతం వారి వారి రంగాల్లో నిష్ణాతులు. పరీక్షల నిర్వహణకు ఇప్పడ నుసరిస్తున్న విధానాల్లోని లోటుపాట్లు అధ్యయనం చేసి, ఎలాంటి సంస్కరణలు అవసరమో వీరు సూచిస్తారు. అడుగడుగునా చోటుచేసుకోవటానికి ఆస్కారం ఉన్న అవకతవకలనూ, అనైతిక పద్ధతులనూ నివారించటానికి ఏం చేయాలో చెబుతారు.

వీటన్నిటికన్నా ముందు అసలు పరీక్ష నిర్వహణకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) వంటి జాతీయ సంస్థ అవసరమా అనే సంగతి నిగ్గుదేల్చటం అవసరం. ఒక సంస్థకు దాని సామర్థ్యానికీ, వనరులకూ మించిన బాధ్యతల్ని అప్పగించటం సరైందేనా? ఆలోచించాలి. రెండేళ్లనాటి రాధాకృష్ణన్ కమిటీ నివేదికలోని అంశాలేమిటో, దాని సిఫార్సులపై తీసుకున్న చర్యలేమిటో చెప్పాల్సిన బాధ్యత పాలకులకు లేదా? కాక్రోచ్ ఉద్యమం సాగుతుండగానే 2024 నీట్ లీక్ ప్రధాన నిందితుడిపై వచ్చిన ఆరోపణలు రుజువు కాలేదని సీబీఐ ప్రకటించటం మరో వైచిత్రి. ఇక విద్యార్థులపై అత్యంత ఘోరంగా బలప్రయోగానికి పూనుకున్నవారిపైనా చర్యలుండాలి.

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కేంద్రం ఇకపై అవసరమైన చర్యలు నిరంతరం తీసుకుంటూనే ఉంటుందని ప్రధాని చెప్పటం హర్షించదగ్గది. ఇది కేంద్ర స్థాయిలో మాత్రమే కాదు... రాష్ట్రాల స్థాయిలో కూడా జరగాలి. ఇతర రాష్ట్రాల మాటెలవున్నా తమ ఏలుబడిలోని ప్రభుత్వాలైనా జవాబుదారీతనంతో వ్యవహరించేలా చూడాల్సిన బాధ్యత ఎన్డీయే పెద్దలకుంది. ప్రధాని హామీ కంటితుడుపు చర్య మాత్రమేనని, రాష్ట్రాల్లో కూడా కాక్రోచ్‌ల స్థాయిలో ఉద్యమిస్తే తప్ప డీఎస్సీ అవకతవకల వంటివి పట్టించుకోబోరన్న సంకేతాలు వెళ్లరాదు. అందుకే దేశంలో యువత మనసు గెలవాలంటే నెగ్గాల్సిన పరీక్షలు చాలానే ఉన్నాయని కేంద్రం గుర్తించాలి.



## పన్ను వసూళ్ల జోరు...
# ఆర్థిక బలం పెరుగుతోందా?

**ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థలో ఇటీవల కనిపిస్తున్న సానుకూల పరిణామాల్లో పన్ను వసూళ్ల పెరుగుదల ఒకటి. 2026–27 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూలై వరకు రాష్ట్ర నికర వస్తు సేవల పన్ను వసూళ్లు రూ.13,283 కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 21 శాతం వృద్ధి నమోదైంది. జాతీయ సగటు 17 శాతంతో పోలిస్తే ఇది మెరుగైన పనితీరు. ఇదే సమయంలో మొత్తం వాణిజ్య పన్నుల వసూళ్లు 20 శాతం పెరిగి రూ.20,464.7 కోట్లకు చేరడం కూడా గమనార్హం. ఈ పెరుగుదల వెనుక కేవలం ఆర్థిక కార్యకలాపాల విస్తరణ మాత్రమే కాకుండా పన్ను పరిపాలనలో మార్పులు కూడా కీలకంగా కనిపిస్తున్నాయి. పన్ను చెల్లింపులపై పర్యవేక్షణను పెంచడం, సమాచార సాంకేతికతను విస్తృతంగా వినియోగించడం, పన్ను ఎగవేతలను నిరోధించడం, నమోదిత వ్యాపారాల కార్యకలాపాలను విశ్లేషించడం వంటి చర్యలు ఆదాయాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతున్నాయి. ముఖ్యంగా పన్ను వ్యవస్థను మరింత సరళీకరించడం, వ్యాపారులకు అనుసరణ వ్యయాన్ని తగ్గించడం వంటి జీఎస్టీ సంస్కరణల నేపథ్యంలోనూ ఏపీ వసూళ్లు పెరగడం ప్రోత్సాహకరమైన సంకేతం.**




రాష్ట్ర ప్రభుత్వం ఆదాయాన్ని పెంచడంతోపాటు పన్ను వ్యవస్థను మరింత పారదర్శకంగా, సాంకేతికత ఆధారితంగా మార్చాల్సిన అవసరాన్ని గుర్తించింది. పన్ను చెల్లింపుదారులకు అనుకూల వాతావరణం కల్పించడం, చిన్న వ్యాపారాలను అధికారిక ఆర్థిక వ్యవస్థలోకి తీసుకురావడం, పన్ను ఎగవేతలను అరికట్టడం వంటి చర్యలు దీర్ఘకాలంలో మరింత స్థిరమైన ఆదాయానికి దోహదపడతాయి. అయితే, వసూళ్లు పెరగడం మాత్రమే లక్ష్యం కాకుండా పన్ను ఆధారం విస్తరించడం ప్రధాన లక్ష్యంగా ఉండాలి.

ఇందులో కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా కీలకం. 2026-27లో ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటాగా సుమారు రూ.64,362 కోట్లు, కేంద్ర గ్రాంట్లుగా రూ.32,458 కోట్లు లభిస్తాయని అంచనా. గత సవరించిన అంచనాలతో పోలిస్తే ఇవి వరుసగా 13 శాతం, 17 శాతం పెరుగుదలను సూచిస్తున్నాయి. అంతేకాదు, కేంద్ర బడ్జెట్‌లో 16వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు రాష్ట్రాలకు రూ.1.4 లక్షల కోట్ల ఆర్థిక సంఘం గ్రాంట్లను కేటాయించారు. ఇటువంటి పన్నుల పంపిణీ, గ్రాంట్లు రాష్ట్రాల ఆర్థిక సామర్థ్యాన్ని బలోపేతం చేయడంలో సహాయక పాత్ర పోషిస్తాయి.

అయితే ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. పన్ను వసూళ్లు పెరగడం ఆర్థిక వ్యవస్థ బలపడుతోందన డానికి ముఖ్యమైన సూచికే కానీ అంతిమ ప్రమాణం కాదు. పారిశ్రామిక ఉత్పత్తి, సేవారంగం, వ్యవసాయ ఆదాయం, ఉపాధి, ప్రైవేటు పెట్టుబడులు, చిన్న-మధ్య తరహా పరిశ్రమల కార్యకలాపాలు కూడా పెరగాలి. అప్పుడే పన్ను వసూళ్ల పెరుగుదల విస్తృత ఆర్థిక చైతన్యానికి ప్రతిబింబంగా మారుతుంది. ముఖ్యంగా పెరిగిన ఆదాయాన్ని ఉత్పాదక రంగాల్లో పెట్టుబడిగా మలచడం అత్యవసరం. రహదారులు, నీటిపారుదల, విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక మౌలిక వసతులపై పెట్టుబడులు పెరిగితే ఆర్థిక కార్యకలాపాలు మరింత విస్తరిస్తాయి. తద్వారా మరింత పన్ను ఆదాయం సమకూరుతుంది. ఇది ఆదాయం-పెట్టుబడి-ఉపాధి-వృద్ధి-మరింత ఆదాయం అనే సానుకూల చక్రాన్ని సృష్టిస్తుంది. అందువల్ల ప్రస్తుత పన్ను వసూళ్ల పెరుగుదలను ఆశాజనక ప్రారంభంగా చూడాలి. రాష్ట్ర ప్రభుత్వ పన్ను పరిపాలనా ప్రయత్నాలకు, కేంద్రం నుంచి లభిస్తున్న పన్నుల వాటా మరియు గ్రాంట్లకు తోడు ఉత్పాదక పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరిగినప్పుడే ఆంధ్రప్రదేశ్ ఆర్థిక బలం స్థిరమైనదిగా మారుతుంది. పన్ను వసూళ్లు పెరగడం విజయానికి సంకేతం కావచ్చు; ఆ ఆదాయం ప్రజల జీవితాల్లో కనిపించే అభివృద్ధిగా మారడమే అసలు విజయం.

– సీహెచ్ ప్రతాప్

# జమ్మూ–కశ్మీర్‌లో రాష్ట్ర హోదా!?

**జమ్మూ–కశ్మీర్‌కు రాష్ట్ర హోదా నిరుడు కురిసిన హిమసమూహమేనా? భారత రాజ్యాంగ అధికరణ 370ని రద్దు చేసి, జమ్మూ–కశ్మీర్ రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చివేసిన చరిత్రకు 5 ఆగస్టు 2026న ఏడు సంవత్సరాలు పూర్తవుతాయి. రానున్న ఈ ఏడవ వార్షికం సందర్భంగా జమ్మూ–కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించాలన్న డిమాండ్‌ను పునరుద్ఘాటించేందుకు ఆ కేంద్ర పాలిత ప్రాంత అధికార పక్షం నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) ఈ నెల 20న న్యూఢిల్లీలో ఒక నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఎన్‌సీకి పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (కశ్మీర్ లోయలో ప్రభావ ప్రాబల్యాలు ఉన్న పార్టీ) నుంచి తోడ్పాటు లభించలేదు. 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాలు ఎన్‌సీ నిరసన పట్ల ఉదాసీనత చూపాయి. అసలు ఈ జూలై 20న న్యూఢిల్లీలో ఆ కార్యక్రమాన్ని నిర్వహించడమే వివేకవంతమైన నిర్ణయం కాదు. ఎందుకంటే అదే రోజున కాక్రోచ్ జనతా పార్టీ పిలుపు మేరకు విద్యార్థులు, యువజనులు ఢిల్లీ వీధులలో పోటెత్తారు. పోలీసులు వారి పట్ల పాశవికంగా ప్రవర్తించారు. ఆ రోజు మీడియా దృష్టి అంతా ఈ నిరసన ప్రదర్శన, పోలీసులు దానిని అణచివేసిన తీరుపైనే కేంద్రీకృతమై ఉన్నది.**




జూలై 20 నిరసనతో జమ్మూ-కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ మళ్లీ ప్రజల్లో పెద్ద చర్చనీయాంశమవుతుందని నేషనల్ కాన్ఫరెన్స్ ఆశించింది. అయితే ఆ నిరసన ప్రభావ శూన్యంగా మిగిలిపోయింది. అయినప్పటికీ ఆ అపరిష్కృత డిమాండ్ దేశం ముందు ఒక అతి ముఖ్యమైన ప్రశ్నగా ఉన్నది. భారతదేశ చరిత్రలో ఒక రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా తగ్గించి వేయడమనేది ప్రప్రథమంగా జమ్మూ-కశ్మీర్ విషయంలోనే జరిగింది. ఆగస్టు 5, 2019న ఇది సంభవించినప్పుడు కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను సాధ్యమైనంత త్వరలో పునరుద్ధరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ మాటను అందరూ విశ్వసించారు. అయితే ఏడు సంవత్సరాలు గడిచినా ఆ వాగ్దానం ఒక మాటగా మాత్రమే మిగిలిపోయింది. ఈ దురదృష్టకర పరిణామం ఆ ప్రాంత ప్రజలకే కాకుండా ప్రజాస్వామికవాదులైన సమస్త భారతీయులకూ దిగ్భ్రాంతి, వ్యాకులత కలిగిస్తోందనడంలో సందేహం లేదు.

కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ విషయమై కేంద్ర ప్రభుత్వ వాగ్దానాల వివరాలను ఏప్రిల్ 2024లో కశ్మీర్ టైమ్స్ అనే స్వతంత్ర వెబ్‌సైట్ ప్రచురించింది. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన అధికరణ 370ని రద్దు చేసిన రెండు నెలలకు (అక్టోబర్ 2019లో) కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతూ, 'సాధారణ పరిస్థితులు నెలకొన్న వెంటనే కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని' చెప్పారు. అదే ఏడాది డిసెంబర్‌లో రామ్ మాధవ్ (ఆనాడు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి) కశ్మీర్‌కు 'త్వరలోనే' రాష్ట్ర హోదా పునరుద్ధరణ అవుతుందని ఉద్ఘాటించారు. ఫిబ్రవరి 2021లో 'కశ్మీర్‌కు తగిన తరుణంలో పూర్తి స్థాయి రాష్ట్ర హోదాను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చెప్పారు. అక్టోబర్ 2021లో కశ్మీర్‌ను సందర్శించిన అమిత్‌షా 'రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన వెంటనే కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తి నిస్తామని ఉద్ఘాటించారు. జనవరి 2022లో అమిత్‌షా ఇలా చెప్పారు: 'నియోజకవర్గాల పునర్విభజన ప్రారంభమయింది. ఆ తరువాత అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. కశ్మీర్‌లో పరిస్థితులు యథాస్థితికి వచ్చిన వెంటనే రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని లోక్‌సభకు హామీ ఇచ్చాను.' పదమూడు నెలల అనంతరం ప్రభుత్వ అనుకూల టీవీ చానెల్ నొకదానికి ఇచ్చిన ఇంటర్వ్యూలోనూ 'అసెంబ్లీ ఎన్నికలు పూర్తయిన వెంటనే కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తామని స్పష్టంగా చెప్పాను' అని అమిత్‌షా అన్నారు.

2022లో జమ్మూ-కశ్మీర్‌లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. జమ్మూ ప్రాంతంలో ఆరు కొత్త నియోజకవర్గాలు ఏర్పడగా కశ్మీర్ లోయలో ఒకటి మాత్రమే అదనంగా ఏర్పడింది. 2024 సెప్టెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించారు. నాలుగు నెలల ముందే ఉధాంపూర్-దోడాలో ఆ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎన్నికల అనంతరం కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరిస్తామని చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజనతో ప్రత్యర్థి పక్షాల ఓట్లు చీలిపోయి తమకు లబ్ధి చేకూరుతుందని మోదీ, అమిత్‌షాలు విశ్వసించారన్నది స్పష్టం. అయితే వారి విశ్వాసం వమ్మయింది. ఇండియా కూటమి గెలుపును అడ్డుకోవడంలో వారి వ్యూహాలు విఫలమయ్యాయి. మొత్తం 90 నియోజకవర్గాలలో 49 ఇండియా కూటమికి దక్కాయి. వీటిలో 42 నేషనల్ కాన్ఫరెన్స్ గెలిచిన స్థానాలు. ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రి అయ్యారు. అసెంబ్లీ ఎన్నికలలో ప్రజల తీర్పును గౌరవించేందుకైనా కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణపై చిత్తశుద్ధి చూపారా? లేదు. కశ్మీర్‌కు రాష్ట్ర హోదా తప్పక ఇస్తామని మార్చి 2025లో అమిత్‌షా న్యూఢిల్లీలో అన్నారు. అదే ఏడాది అక్టోబర్‌లో కూడా 'తగిన సమయం'లో కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని ఆయన చెప్పారు.

ఈ హామీలలో ఏ ఒక్కదానినీ నెరవేర్చలేదని మరి చెప్పనవసరం లేదు. ఆ వాగ్దానాలలోని భాషను నిశితంగా పరిశీలించండి. ఉద్దేశపూర్వకంగానే అది అస్పష్టంగా, సందిగ్ధంగా ఉన్నట్టు అర్థమవుతుంది. 'సాధారణ పరిస్థితులు', 'త్వరలో', 'సరైన సమయంలో', 'తగిన తరుణంలో'- వీటిల్లో ఏ ఒక్కటైనా ఎట్టకేలకు ఆసన్నమయిందని ఎవరైనా ఎలా నిర్ణయించగలరు? కశ్మీర్‌కు న్యాయబద్ధమైన పూర్తి స్థాయి రాష్ట్ర హోదా పునరుద్ధరణను జాప్యం చేసేందుకే పాలకులు ఇలా మాట్లాడుతున్నారనేది స్పష్టం.

2019 ఆగస్టు నుంచీ జమ్మూ-కశ్మీర్ ప్రజల ప్రజాస్వామిక హక్కులను న్యూఢిల్లీ పాలకులు పూర్తిగా అలక్ష్యం చేస్తున్నారు. ఈ జూలై తొలి రోజుల్లో అనంతనాగ్‌లో ఉగ్రవాద దాడిలో పోలీస్ కానిస్టేబుల్ ఒకరు చనిపోయారు. ఆ ఘటనకు బాధ్యులు అనే ఆరోపణతో 2500 మందిని అరెస్ట్ చేశారు! కశ్మీర్‌లో ప్రజాస్వామిక హక్కులపై మోదీ ప్రభుత్వానికి ఇసుమంత గౌరవం కూడా లేదనడానికి ఇంతకంటే మరో తార్కాణమేముంటుంది? ఒక వ్యక్తి దుర్మరణానికి ఇన్ని వేల మందిని నిందితులుగా పరిగణించడం న్యాయమేనా? ఇంతమంది పౌరులను ఒక వ్యక్తి హత్య కేసులో అనుమానించడానికి.. భారత రాజ్యాంగానికి ఏ వ్యాఖ్యానం సమ్మతిస్తుంది? రాజ్యాంగపరమైన ఈ ప్రశ్నకు సమాధానం లభించదు. ఎందుకంటే అది స్పష్టంగా పౌరుల ప్రాథమిక హక్కుల ఉల్లంఘన, సందేహం లేదు.

2024 అసెంబ్లీ ఎన్నికలలో 64శాతం మంది ఓటర్లు తమ ప్రజాస్వామిక హక్కును వినియోగించుకున్నారు. కశ్మీర్‌లో ఇది రికార్డు స్థాయి పోలింగ్. జమ్మూ-కశ్మీర్ ప్రజలు బహుళ-పార్టీ ప్రజాస్వామ్యాన్ని గట్టిగా కోరుకుంటున్నారని, కనుకనే మున్నెన్నడూ లేని విధంగా అసెంబ్లీ ఎన్నికలలో పెద్ద ఎత్తున పోలింగ్‌లో పాల్గొన్నారని స్పష్టమవుతుంది. నేషనల్ కాన్ఫరెన్స్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావొస్తోంది. అయినా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ ఆ ప్రజా తీర్పును ధిక్కరిస్తోంది, అపహసిస్తోంది. కశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణకు తిరస్కరిస్తోంది.

1950-2019 సంవత్సరాల మధ్య జమ్మూ-కశ్మీర్ భారత గణతంత్ర రాజ్యంలో ఒక పూర్తిస్థాయి రాష్ట్రంగా ఉన్నది. అదేకాలంలో భారత్‌లో అంతర్భాగాలుగా ఉన్న తొమ్మిది హిమాలయ ప్రాంతాలు రాష్ట్ర ప్రతిపత్తిని సాధించుకున్నాయి. అప్పటివరకు ఆ ప్రాంతాలకు రాష్ట్ర ప్రతిపత్తిని కల్పించడమనేది ఆచరణీయం కాని విషయంగా భావించేవారు. ఆ రాష్ట్రాలు: అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్, మిజోరం, మేఘాలయ, సిక్కిం, త్రిపుర, మణిపూర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్. గమనార్హమైన విషయమేమిటంటే ఈ తొమ్మిది రాష్ట్రాలలోను జమ్మూ-కశ్మీర్‌లో కంటే తక్కువ జనాభా ఉన్నది. నిజానికి పలు హిమాలయ రాష్ట్రాలలో చాలా చాలా తక్కువ జనాభా మాత్రమే ఉన్నది. అయినా ఆ ప్రాంతాలన్నీ రాష్ట్ర ప్రతిపత్తిని పొందాయి. ప్రజాస్వామికంగా ఎన్నికైన వాటి ప్రభుత్వాలు నిజమైన అధికారాలు చలాయిస్తున్నాయి. మరి జమ్మూ-కశ్మీర్‌లో ఆగస్టు 2019 నుంచి ప్రజాస్వామికంగా ఎన్నికవ్వని లెఫ్టినెంట్ గవర్నర్ ఒక వైస్రాయిలా పరిపాలిస్తున్నాడు. న్యూఢిల్లీ పాలకులకు విధేయంగా వ్యవహరిస్తున్నాడు. ఇదేమి ప్రజాస్వామ్యం? కశ్మీర్ ప్రజలు నిజమైన ప్రజాస్వామ్యానికి అర్హులు. మరి వారెందుకు వివక్షకు గురవుతున్నారు? ఈ ప్రశ్నకు సమాధానమివ్వడం కష్టమేమీ కాదు. ఆ ఎనిమిది హిమాలయ రాష్ట్రాలు ఏ ఒక్క దానిలోనూ ముస్లింలు మెజారిటీగా లేరు. జమ్మూ-కశ్మీర్‌లో మాత్రమే ముస్లింలు అధిక సంఖ్యాకులుగా ఉన్నారు. ప్రధానమంత్రి, హోంమంత్రి ఔదలదాల్చిన హిందుత్వ భావజాలం ముస్లింలను ద్వితీయ శ్రేణి పౌరులుగా మాత్రమే పరిగణిస్తున్నది. ఈ మతమైనారిటీలు అధిక సంఖ్యాకుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండాల్సిందేనని నిర్దేశిస్తున్నది. భారత గణతంత్ర రాజ్య పూర్తిస్థాయి పౌరులుగా వారిని ఎంచదు, గౌరవించదు. జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణను కేంద్రం నిరాకరిస్తూనే ఉన్నది. ఒక సహేతుకమైన డిమాండ్‌ను అదే పనిగా తిరస్కరించడం జాతి శ్రేయస్సుకు ఎలా దోహదం చేస్తుంది? ఆ తిరస్కరణ హానికరమైన మెజారిటీవాద పాలనా విధానాలను బలపరుస్తూ భారత రిపబ్లిక్ సమైక్యత, సమగ్రతకు ఆటంకమవుతోంది.

# ఎన్నికల భ్రష్టాచారాలకు పరాకాష్ఠ!




**మన రాజ్యాంగ ప్రవేశిక 'భారతదేశ ప్రజలమైన మేము...' అంటూ మొదలవుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే నిజమైన యజమానులని, ఎన్నికల ద్వారా తాము ఎంచుకున్న ప్రతినిధులకు వారు పాలనాధికారాన్ని తాత్కాలికంగా, సంవిధానానికి కట్టుబడి పనిచేస్తామనే షరతు మీద అప్పగిస్తారని అది స్పష్టీకరిస్తుంది. ఆ విధంగా రాజకీయాధికారానికి చట్టబద్ధత కల్పించే ఎలక్షన్లు ఎప్పుడూ స్వేచ్ఛాయుతంగా నిష్పక్షపాతంగా జరగాలి. ఎన్నికల ప్రక్రియపై ప్రజావిశ్వాసం ఇనుమడించాలంటే అన్నింటికన్నా ముందు ఓటర్ల జాబితాలు సక్రమంగా ఉండాలి. అంటే- అర్హులెవరూ ఓటుహక్కుకు దూరంకాకూడదు. అనర్హుల పేర్లు ఏవీ ఆ లిస్టుల్లోకి వచ్చిచేరకూడదు. కానీ, అరాచకత్వానికి పర్యాయపదంగా పరువుమాసిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జమానాలో ఏపీలో ఇందుకు విరుద్ధమైన పరిస్థితులు రాజ్యమేలాయి. ప్రజాస్వామ్యం గొంతుకోసైనా అధికారాన్ని నిలబెట్టుకోవాలనుకున్న వైకాపా ప్రబుద్ధ నేతాగణాలు అప్పట్లో చాలాచోట్ల దొంగ ఓట్లను గంపగుత్తగా జాబితాల్లోకి ఎక్కించినట్లు కథనాలు వెలువడ్డాయి. ఎలక్షన్ కమిషన్ చేపట్టిన 'సర్'లో వెలుగుచూస్తున్న వాస్తవాలు- జగన్ పార్టీ చీకటి పాలనా కాలంలో అవధులు దాటిన అవకతవకలకు సాక్ష్యాధారాలుగా నిలుస్తున్నాయి!**

రాజ్యాంగం మీద గౌరవం కానీ, ప్రజాప్రయోజనాల పట్ల పట్టింపు కానీ ఏమీలేని వైకాపా నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని చేసిన దురాగతాలకు లెక్కేలేదు. తమ మోచేతి నీళ్లకు అంగలార్చే అధికారగణాలను తోడుచేసుకుని ఆ అయిదేళ్లలో వాళ్లు ఒడిగట్టిన అక్రమాలపై వెల్లువెత్తిన ఆరోపణలకైతే అంతేలేదు. వాటన్నింటిలోకి తీవ్రమైనది... ఓటర్ల జాబితాలతో ఇష్టారాజ్యంగా ఆటలాడుకోవడం! ప్రజాస్వామ్య మౌలిక నిర్మాణాన్ని కూలదోసి నిరంకుశ రాజ్యాన్ని కొనసాగించాలనుకున్న కుతంత్రాలకు అది పరాకాష్ఠ! 2021 తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నికల సందర్భంగా వేలసంఖ్యలో ఎపిక్ కార్డులను దొంగచాటుగా డౌన్‌లోడ్ చేసి, వాటి ఆధారంగా బోగస్ ఓట్లు వేయించిన పన్నాగాలు ఆనాడే అందరినీ దిగ్భ్రాంతపరిచాయి. శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ప్రత్యర్థి పార్టీలకు చెందినవారి ఓట్లను తీసేయించడం, నకిలీ ఓటర్లను లిస్టుల్లో చేర్చడం తదితరాలకు వైకాపా నేతలు విపరీతంగా పాల్పడినట్లు ఫిర్యాదులెన్నో వచ్చాయి. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో వారు ఇలాంటి పాడు పనులెన్నింటికో తెగబడినట్లు ఊరూవాడా మోతెక్కిపోయింది. దానికితగినట్లే 'సర్'లో భాగంగా ఏపీలో తొలగించదగినవిగా ఈసీ గుర్తించిన దాదాపు 45లక్షల ఓట్లలో ముప్పైశాతం కడప, కర్నూలు, అనంతపురం, తిరుపతి, నెల్లూరు జిల్లాల్లోనే ఉన్నట్లు తేలింది. ఒకరి పేరు మీదే రెండేసి ఓట్లు ఉండటం, ఓటర్ల చిరునామాలుగా పేర్కొన్న చోట్ల ఆయా వ్యక్తులెవరూ లేకపోవడం వంటివి తామరతంపరగా బయటపడుతున్నాయి. ప్రజాతీర్పును అపహాస్యం చేసే నకిలీ ఓట్లను ఏరిపారేయడమే కాదు ఇలాంటివి ఇంకెప్పుడూ జాబితాల్లోకి వచ్చికలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడమూ ఈసీ విధ్యుక్తధర్మమే! ఒక్క ఓటుతో అభ్యర్థుల తలరాతలు మారిపోయే మన ఎన్నికల విధానంలో దొంగ ఓటర్ల వల్ల జరిగే నష్టం అంతాఇంతా కాదు. కాబట్టి ఓటర్ల జాబితా రూపకల్పనలో ఈసీ వర్గాలు నిష్ఠగా నిబద్ధతతో పనిచేయాలి. సుప్రీంకోర్టు లోగడ నిర్దేశించినట్లుగా, బోగస్ ఓట్లు వంటి భ్రష్టాచారాలపై ఉక్కుపాదం మోపాలి. కానీ, ఓటర్ల లిస్టుల తయారీకి స్థానిక యంత్రాంగంపైనే ఆధారపడాల్సి రావడంతో కొన్నిచోట్ల స్వార్థ నాయకులతో కుమ్మక్కు అవుతున్న అధికారుల మూలంగా ఎన్నికల ప్రక్రియ పవిత్రతే మంటగలిసిపోతోంది. ఆ దుస్థితిని పరిహరించడానికి పర్యవేక్షణను కట్టుదిట్టం చేయడం, అపరాధులుగా తేలినవారిపై కఠినచర్యలు తీసుకోవడంలో ఈసీ చురుగ్గా వ్యవహరించాలి!

# క్రీడా ప్రతిభతోపాటు విద్యలోనూ రాణించాలి

**- : కలెక్టర్ అంకిత్**

**- పాఠశాలల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి**

**- పల్లె దవాఖానల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 11, అనంత జనశక్తి న్యూస్ :**



విద్యార్థులు క్రీడా ప్రతిభతోపాటు విద్యలోనూ ఉత్తమ ఫలితాలు సాధించేలా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. పాఠశాలల్లో నాణ్యమైన పౌష్టికాహారం, పల్లె దవాఖానల్లో మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. మంగళవారం పాల్వంచ మండలం కిన్నెరసాని, యానంబైలు, రాజాపురం ప్రాంతాల్లోని పాఠశాలలు, పల్లె దవాఖాన, అంగన్వాడీ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.
కిన్నెరసాని గిరిజన సంక్షేమ ఆదర్శ క్రీడా పాఠశాలలో తరగతి గదులు, వసతి గృహాలు, వంటశాల, గ్రంథాలయం, క్రీడా ప్రదేశాలు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, భవనాల పరిస్థితి తదితర అంశాలను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వసతి గృహంలో సమస్యలు ఉన్నాయా, సదుపాయాలు సక్రమంగా అందుతున్నాయా అని ఆరా తీశారు.
తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ వారి విద్యా ప్రగతిపై ఆరా తీశారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, ఇతర విద్యా సామగ్రి అందాయా, తరగతులు సక్రమంగా జరుగుతున్నాయా, ఉపాధ్యాయులు బోధనపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారా అని తెలుసుకున్నారు. అనంతరం వంటశాలను పరిశీలించి విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహారాన్ని స్వయంగా పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యత, తయారీ విధానం, వంటశాల పరిశుభ్రత, మెనూ అమలు తదితర అంశాలను పరిశీలించారు. ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన, పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి సూచించారు.
క్రీడా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న క్రీడా శిక్షణపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థులు ఏయే క్రీడల్లో శిక్షణ పొందుతున్నారు, వివిధ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారా, అవసరమైన క్రీడా సామగ్రి అందుబాటులో ఉందా అనే వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను గుర్తించి మెరుగైన శిక్షణ అందించాలని సూచించారు. విద్య, క్రీడలకు సమాన ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు.
అనంతరం యానంబైలు జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడి భోజనం నాణ్యత, రుచి, మెనూ అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ రోజు నిర్ణయించిన మెనూ ప్రకారం ఆహారం అందించకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన, రుచికరమైన, పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలని ఆదేశించారు. ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
పాఠశాల తరగతి గదులు, ఆవరణ, పరిసరాలను పరిశీలించిన కలెక్టర్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు.
యానంబైలు పల్లె దవాఖానను తనిఖీ చేసిన కలెక్టర్ ప్రజలకు అందుతున్న ప్రాథమిక వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించారు. రక్త పరీక్షల నమూనాలు, ఔషధ నిల్వలు, మందుల పంపిణీ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మందుల గడువు తేదీలను పరిశీలించి గడువు ముగిసిన మందులు వినియోగంలోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. రోగుల వివరాలు, వైద్య సేవలు, రక్త పరీక్షలు, మందుల నిల్వలు, పంపిణీ తదితర వివరాలను సంబంధిత రిజిస్టర్లలో ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలు సకాలంలో అందేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని అన్నారు. ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.
కిన్నెరసాని గ్రామపంచాయతీ పరిధిలోని రాజాపురం అంగన్వాడీ కేంద్రాన్ని కూడా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో చిన్నారులు నిద్రిస్తున్న నేపథ్యంలో వారికి అసౌకర్యం కలగకుండా కేంద్రంలో అందుతున్న సదుపాయాలు, పౌష్టికాహారం, విద్యా కార్యకలాపాల వివరాలను అంగన్వాడీ ఉపాధ్యాయురాలిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల హాజరు, రోజువారీ ఆహార మెనూ, పౌష్టికాహారం, గుడ్ల పంపిణీ తదితర అంశాలపై ఆరా తీశారు. చిన్నారులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న ఆహారాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఆహార నాణ్యత, తయారీ విధానం, వంటశాల పరిశుభ్రతను పరిశీలించి చిన్నారులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన పౌష్టికాహారం అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గుడ్లు, ఇతర పౌష్టికాహార పదార్థాల నిల్వలను పరిశీలించారు. అర్హులైన ప్రతి చిన్నారికి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ పాఠశాలలు, క్రీడా పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, పల్లె దవాఖానల్లో ప్రభుత్వం అందిస్తున్న సేవలు క్షేత్రస్థాయిలో ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. విద్యార్థులు, చిన్నారులు, గ్రామీణ ప్రజలకు అందించే భోజనం, పౌష్టికాహారం, విద్య, వైద్యం, మందులు, వసతి తదితర అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. అధికారులు తమ పరిధిలోని సంస్థలను తరచూ సందర్శించి పరిస్థితులను స్వయంగా పరిశీలించాలని, లోపాలు గుర్తించిన వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీలలో తహసీల్దార్లు ధారా ప్రసాద్, ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వాలీబాల్ నందు ప్రథమ స్థానంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు



**యాడికి, ఆగష్టు 11, అనంత జనశక్తి న్యూస్:**

అనంత స్పోర్ట్స్ ఛాంపియన్షిప్ అండర్ 14 క్రింద తాడిపత్రి నియోజకవర్గ స్థాయిలో జరిగిన క్రీడల పోటీలలో యాడికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని ప్రధానోపాధ్యాయుడు సీతారామాంజనేయులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సీతారామాంజనేయులు,
పీడీలు చంద్రకళ, శివశంకర్ లు మాట్లాడుతూ బాలుర విభాగంలో వాలీబాల్ నందు ప్రథమ స్థానంలో విజయం సాధించారని, బాలికల విభాగంలో జరిగిన కబడ్డీ ఫైనల్ పోటీలో రన్నర్స్ గా ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. ఈ విజయం పట్ల ప్రధానోపాధ్యాయుడు సీతారామాంజనేయులు, ఉపాధ్యాయ సిబ్బంది హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

# ఎన్ ఎం ఎం ఎస్ కు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపిక




**యాడికి, ఆగష్టు 11, అనంత జనశక్తి న్యూస్**

**గత సంవత్సరం డిసెంబర్ లో జరిగిన నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్షిప్ పోటీ పరీక్షల్లో మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపిక అయ్యారని మంగళవారం ప్రధానోపాధ్యాయుడు సీతారామాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముగ్గురు విద్యార్థులు స్కాలర్షిప్ అందుకోవడానికి అర్హత సాధించారని, సూర్యనారాయణ 104 మార్కులు ,శ్రీమన్నారాయణ 94 ,అరవింద్ 93 అర్హత సాధించారని తెలిపారు. ఇంటర్మీడియట్ వరకు నాలుగు సంవత్సరాలు సంవత్సరానికి రూ.12,000 అందజేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం , ఉపాధ్యాయ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ పిల్లలను అభినందించారు.**

# ఇన్ సర్వీసు టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చేలా చూడండి



**- ఎమ్మెల్సీ రామచంద్రా రెడ్డికి పీ.ఆర్.టీ.యూ నేతల వినతి**

**అనంతపురం ఆగస్ట్ 11, అనంత జనశక్తి న్యూస్**

ఇన్సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చేలా చట్ట సవరణ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పీ.ఆర్.టీ.యూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి విన్నవించారు. ఈ మేరకు ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలసి వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ లో విధులు నిర్వహిస్తున్న ఇన్సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ కు సంబంధించి ఎదుర్కొంటున్న సమస్యలను అందులో ప్రస్తావించారు. ఇప్పటికే అనేక సంవత్సరాలుగా విద్యారంగంలో సేవలందిస్తూ, విద్యార్థులకు బోధనా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఇన్సర్వీస్ ఉపాధ్యాయుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, వారికి ప్రత్యేకంగా టెట్ పరీక్ష నుంచి వెసులుబాటు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ అంశాన్ని కేంద్ర విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

# అర్హులైన చేనేత కార్మికులకు న్యాయం జరగాలి



**యాడికి, ఆగష్టు 11, అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన నేతన్న సేవలో పథకంలో అర్హులైన చేనేత కార్మికులకు న్యాయం జరగాలని చేనేత జౌళి శాఖ ఎడి, ఎడిఓ శ్రీనివాసులుకు చేనేత కార్మికులు, తెదేపా నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రంలో ఉన్న ఎంపిడిఓ కార్యాలయంలో మంగళవారం సమావేశం ను నిర్వహించారు. రూ. 25వేల చాలా మంది నేతన్నల ఖాతాలో జమ అయ్యాయని ,అయితే కొద్దిమంది నిజమైన చేనేత కార్మికుల ఖాతాల్లో నేతన్న సేవ డబ్బులు జమ కాలేదని తెలిపారు. ఈ విషయం దృష్టిలో ఉంచుకొని మన ఎమ్మెల్యే జెసి అస్మిత్ రెడ్డి జౌలీ శాఖ ఏడి శ్రీనివాసులను యాడికి వెళ్లి అర్హులైన లబ్ధిదారులందరికీ డబ్బులు అందేటట్లు చూడాలని ఆదేశించారు. నిజమైన లబ్ధిదారులందరికీ నేతన్న సేవ డబ్బు పడేటట్లు చూస్తామని తెలిపారు. అనంతరం సచివాలయ వెల్ఫేర్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి ,త్వరితగతిన నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేసి డబ్బులు అందేటట్లు చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గొర్తి రుద్రమ నాయుడు, రూపునేని రాజశేఖర్, క్లస్టర్ ఇంచార్జ్ మాయకుంట్ల నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలో ఓ,వ్యక్తికి 10,000/- జరిమానా

**అమడగూరు ఆగష్టు 11 ( అనంత జనశక్తి న్యూస్ )**




అమడగూరు మండలంలోని మహమ్మదాబాద్ గ్రామం, టి జంక్షన్
శ్రీ సత్యసాయి జిల్లా పోలీస్ పరిధిలో, జిల్లా ఎస్.పీ. మరియు, డి.ఎస్.పి, ఆదేశాల మేరకు, నల్లమాడ సి.ఐ. ఆధ్వర్యంలో అమడగూరు ఎస్సై, గోపాలకృష్ణ,మరియు సిబ్బంది 1008 2026 తనకి నిర్వహిస్తుండగా, సాయంకాలం, మహమ్మదాబాద్ టి జంక్షన్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో టిఎన్, 18 బాక్స్, 8840 నంబర్ గల మహేంద్ర, బులోరా, ఎక్స్, 40 టన్నుల ట్రక్కు, డ్రైవర్ హేనరీ ఇబనిజార్ అలెగ్జాండర్ జయరాజ్ (34) మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు గుర్తించి, పెట్టి,చసి,నో .48/2026 U/s 185 ఎం, వి,.ఏ సిటీ,నమోదు చేశారు. నిందితుడిని గౌరవ న్యాయస్థానంలో హాజరుపరచగా, రూ.10,000/ జరిమానా విధించారు.
మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబడును.

# కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

**- ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్లో ఉన్న డి ఏ, సరెండర్ లీవులు ఇవ్వాలి.**

**- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వి.బి భాస్కర్ రెడ్డి.**

**ధర్మవరం ఆగస్టు 11, అనంత జనశక్తి న్యూస్:**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం తాలూకా కార్యవర్గ సమావేశమునకు ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వి బి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.... ఎన్నికలకు ముందు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఇంటీరియర్ రిలీఫ్ ఫండ్ ఇస్తామని, అలాగే మీ పిఆర్సి మీరు ఊహించినంత ఇస్తామని, మీకు పెండింగ్ లో ఉన్న డి ఎ మరియు సరెండర్ లీవులు ఇస్తామని చెప్పిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరములు దాటినా కూడా తను ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని కానీ ఇప్పటికైనా తాను ఇచ్చిన హామీలను నెరవేరుస్తారనే ఆశతో ప్రభుత్వ ఉద్యోగులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు అని, కానీ ప్రభుత్వంలో మాత్రం ఎటువంటి చలనం కూడా లేదని, కావున ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలపై తక్షణమే స్పందించి మాకు రావాల్సిన పిఆర్సి డిఏలు సరెండర్ లీవులు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నామని, అట్లు ఇవ్వని ఎడల ఉద్యోగస్తులందరూ చాలా భారీ ఎత్తున ఆందోళనకు దిగుతారని ప్రభుత్వానికి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తరఫున హెచ్చరిస్తున్నామని, తొందరలోనే మా సంఘం పక్షాన కార్యాచరణ కూడా ప్రకటిస్తామని ప్రభుత్వానికి తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశమునకు ధర్మవరం తాలూకా అధ్యక్షులు బి. సాయి ప్రకాష్, ధర్మవరం తాలూకా కార్యదర్శి ఎస్. ఓబులేసు, మరియు కార్యవర్గ సభ్యులు మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు శ్రీమతి శ్యామలమ్మ, మహిళా విభాగం ధర్మవరం తాలూకా అధ్యక్షురాలు శ్రీమతి రమణమ్మ, మహిళా సంఘం నాయకురాళ్లు మరియు అన్ని శాఖల ఉద్యోగస్తులు కూడా పాల్గొనడం జరిగిందని తెలిపారు.

# ప్రజలకు మంచి సేవలు అందిస్తున్న ప్రభుత్వాన్ని ఆదరించండి

**- రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి జెండా రెపరెపలాడాలి**

**- క్షేత్రస్థాయిలో సమష్టిగా పనిచేసి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి**

**- కొత్తచెరువు మండలంలో నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం ప్రచార కార్యక్రమంలో**

**-ఎట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి**

**కొత్తచెరువు: ఆగస్టు 11:అనంత జనశక్తి న్యూస్**

ప్రజలకు మెరుగైన పాలన, సంక్షేమం, అభివృద్ధి అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తచెరువు మండలంలో నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొని ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. గత వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధిని సర్వనాశనం చేసిన వైసీపీకి రాష్ట్రంలో ప్రజలు చరమగీతం పాడాలని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి జెండా ప్రతి గ్రామంలో రెపరెపలాడేలా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రజలను నేరుగా కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీఓ నటరాజ్ , ఇతర ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు టీడీపీ మండల కన్వీనర్ వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు ,మండల టీడీపీ కన్వీనర్ రామకృష్ణ, టిడిపి సీనియర్ నాయకులు సాలక్క గారి శ్రీనివాసులు కురబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు , సహకార సొసైటీ అధ్యక్షులు హరిప్రసాద్ నాగేంద్ర ప్రసాద్ ,నాయకులు, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ , వెంకటేష్ , శంకర్ , మాధవి ,ముద్దుపాటి రవి, కిరణ్,సూర్య ప్రకాష్ ,పీవీ రమేష్ ,నాయుడు ,కూటమి నాయకులు , కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## జూనియర్ లెక్చరర్లకు శిక్షణ తరగతులు

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 11, అనంత జనశక్తి న్యూస్ :**

గౌరవ కమిషనర్, ఇంటర్మీడియట్ విద్యాశాఖ, తెలంగాణ వారి ఆదేశాల మేరకు మంగళవారం కొత్తగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణితం, రసాయన శాస్త్రం, వృక్షశాస్త్రం, ఆర్థిక శాస్త్రం సబ్జెక్టులకు సంబంధించిన జూనియర్ లెక్చరర్లకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో 8 మంది జిల్లా రిసోర్స్ పర్సన్స్, 56 మంది జూనియర్ లెక్చరర్లు పాల్గొన్నారు. శిక్షణ తరగతులను జిల్లా విద్యాశాఖ అధికారులు, కళాశాలల అధ్యాపకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అజ్జర్ గోపాల్, రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ వరంగల్, హరి వెంకటేశ్వర్లు రావు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారి భద్రాద్రి కొత్తగూడెం, కె. రమేష్, జిల్లా కోఆర్డినేటర్, ప్రిన్సిపాళ్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు, జూనియర్ లెక్చరర్లు పాల్గొన్నారు.

## పాడైపోయిన స్క్రాప్ మిషనరీ అమ్మకానికి

**- ఆసక్తిగల వారు ఈ నెల 14న విస్తా కాంప్లెక్స్‌కు హాజరుకావాలి**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 11, అనంత జనశక్తి న్యూస్ :**




ఐటీడీఏ భద్రాచలం ఆధీనంలోని విస్తా కాంప్లెక్స్‌లో పాడైపోయిన స్క్రాప్ మిషనరీ అమ్మకానికి ఉన్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ సీతారామచంద్ర స్వామివారి ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా పడమర మెట్ల వద్ద ఉన్న విస్తా కాంప్లెక్స్‌లో ఐటీడీఏకు చెందిన 13 షాపులు ఉన్నాయని తెలిపారు. వీటిలో షాప్ నంబర్ 9లో రంగురాళ్లకు సంబంధించిన సుమారు 2.50 టన్నుల పాడైపోయిన స్క్రాప్ మిషనరీ, షాప్ నంబర్ 30లో సుమారు 1.50 టన్నుల పాడైపోయిన స్క్రాప్ మిషనరీ ఉందన్నారు. మొత్తం సుమారు 4 టన్నుల స్క్రాప్ అమ్మకానికి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 14న సాయంత్రం 4 గంటలకు విస్తా కాంప్లెక్స్‌లో హాజరై స్క్రాప్‌ను కొనుగోలు చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ కోరారు.

# ఢిల్లీలో భద్రత కట్టుదిట్టం

(మొదటిపేజీ తరువాయి)

అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించేందుకు ప్రజల సహకారం కూడా తీసుకునేలా ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

**1,000కు పైగా AI కెమెరాలతో నిఘా**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగే రెడ్‌ఫోర్ట్‌తో పాటు కీలక ప్రాంతాల్లో 1,000కు పైగా AI ఆధారిత వీడియో అనలిటిక్స్ కలిగిన CCTV కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా రియల్‌టైమ్‌లో జనసమూహాల కదలికలు, అనుమానాస్పద కార్యకలాపాలను పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. అనుమానాస్పద కదలికలు గుర్తించిన వెంటనే భద్రతా బలగాలు స్పందించేలా నిఘా వ్యవస్థను సిద్ధం చేశారు.

**రెడ్‌ఫోర్ట్ వద్ద బహుళ అంచెల భద్రత**

రెడ్‌ఫోర్ట్ పరిసరాల్లోకి వచ్చే అన్ని ప్రవేశ మార్గాల్లో మల్టీలేయర్ సెక్యూరిటీని అమలు చేస్తున్నారు. యాంటీసాబోటేజ్ తనిఖీలతో పాటు క్విక్ రియాక్షన్ టీమ్స్ (QRTs)ను మోహరించనున్నారు. వ్యూహాత్మక ప్రాంతాల్లో స్నైపర్లు, భవనాల పైకప్పులపై భద్రతా సిబ్బందిని కూడా ఏర్పాటు చేయనున్నారు. అదనంగా SWAT కమాండోలు, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్లు, డాగ్ స్క్వాడ్లను భద్రతా విధుల్లో భాగం చేశారు. రెడ్‌ఫోర్ట్‌కు వచ్చే సందర్శకులు, ఆహ్వానితులను పలు దశల్లో తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతించనున్నారు.

**వాహన తనిఖీలు.. నగరమంతా నిఘా**

భద్రతా ప్రాంతాల్లో వాహన తనిఖీలను మరింత ముమ్మరం చేశారు. కీలక ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు రాత్రింబవళ్లు నిఘా కొనసాగించనున్నారు. ప్రభుత్వ భవనాలు, కీలక సంస్థలు, మార్కెట్లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, బస్ టెర్మినల్స్, రవాణా కేంద్రాలు, ఇతర సున్నిత ప్రాంతాల్లోనూ భద్రతను పెంచారు. హోటళ్లు, గెస్ట్‌హౌస్‌లు, రద్దీగా ఉండే బహిరంగ ప్రదేశాలపై కూడా ప్రత్యేక నిఘా పెట్టారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలను గుర్తించేందుకు పోలీసులు, కేంద్ర భద్రతా సంస్థలు, నిఘా విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.

**ఆకస్మిక నిరసనలపైనా దృష్టి**

ఉగ్రవాద ముప్పుతో పాటు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా జరిగే ఆకస్మిక నిరసనలు, ఆందోళనలు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అంతరాయం కలిగించకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. తాజా నిఘా సమాచారాన్ని, ప్రస్తుత ముప్పు పరిస్థితులను అంచనా వేసిన తర్వాతే భద్రతా ప్రణాళికను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. కేంద్ర భద్రతా సంస్థలు, నిఘా విభాగాలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ అనుమానాస్పద కదలికలపై నిఘా కొనసాగించనున్నారు. ఎలాంటి భద్రతా సవాలు ఎదురైనా వెంటనే స్పందించేలా ఢిల్లీ పోలీస్ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా రాజధానిలో బహుళ అంచెల భద్రతా వ్యవస్థను అమలు చేస్తున్నారు. రెడ్‌ఫోర్ట్ నుంచి కీలక ప్రభుత్వ ప్రాంతాలు, రవాణా కేంద్రాల వరకు విస్తృత నిఘా కొనసాగుతోంది.




# పోలీసుల ఆధ్వర్యంలో కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**ఋమణుగూరు, ఆగస్టు 11 అనంత జనశక్తి న్యూస్**



జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజామున మణుగూరు పట్టణంలోని శివలింగాపురం ప్రాంతంలో కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేస్తూ పెండింగ్ ట్రాఫిక్ చలాన్లపై ప్రత్యేక దృష్టి సారించారు. 147 వాహనాలకు సంబంధించిన పాత పెండింగ్ చలాన్ల ద్వారా మొత్తం రూ.35 వేల రూపాయలను వసూలు చేశారు. అదేవిధంగా నిబంధనలను ఉల్లంఘించిన వారిపై 13 స్పాట్ కేసులు నమోదు చేశారు. సరైన నంబర్ ప్లేట్లు లేని 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే అక్రమంగా తరలిస్తున్న నిల్వ చేసిన రూ.35వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తులపై కేసులను నమోదు చేశారు. అనంతరం శివలింగాపురం కాలనీవాసులతో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ ఏర్పాటుచేసి సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింక్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సరైన నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకుని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నేరాల నియంత్రణలో భాగంగా కాలనీల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, కొత్త వ్యక్తులకు ఇళ్లను అద్దెకు ఇచ్చే సమయంలో వారి పూర్తి వివరాలను తెలుసుకుని, తగిన ధృవీకరణ చేసుకోవాలని ప్రజలకు సూచించారు. చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ప్రజల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, మణుగూరు సీఐ నాగబాబు, ఏడుల్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐలు, పోలీస్, టీజీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆగస్టు 13న చలో కలెక్టరేట్

**- పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలి: ఎస్ఎఫ్ఐ**

**- విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేస్తే కఠిన చర్యలు తీసుకోవాలి**

**మణుగూరు, ఆగస్టు 11, అనంత జనశక్తి న్యూస్**




రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 13న జిల్లాలో నిర్వహించే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మాదాసు అఖిల్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మాదాసు అఖిల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రూ.10,814 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటికీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో నిధులు అందలేదని విమర్శించారు.

ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఆ భారాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై మోపడం అన్యాయమన్నారు. ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విద్యార్థుల నుంచి బలవంతంగా వసూలు చేయడం సరికాదన్నారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు, టీసీలు, మెమోలు, ఇతర విద్యా పత్రాలను కొన్ని కళాశాలలు తమ వద్ద ఉంచుకొని విద్యార్థులు, తల్లిదండ్రులను వేధిస్తున్న ఘటనలు జిల్లావ్యాప్తంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని విద్యార్థుల సర్టిఫికెట్లను ఎలాంటి షరతులు లేకుండా అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేసే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థుల నుంచి అక్రమంగా వసూలు చేసిన మొత్తాలను తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్ నిధులు విడుదల కాకపోవడంతో ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల చదువును బాధ్యతగా చూడాలి తప్ప ప్రైవేట్ విద్యాసంస్థల ఆర్థిక ప్రయోజనాల కోసం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయకూడదని అన్నారు. ఉన్నత విద్యను పేద విద్యార్థులకు అందుబాటులో ఉంచాలంటే ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలోనే స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేసే విధంగా శాశ్వత నిధుల విడుదల వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయడంతో పాటు విద్యార్థుల సర్టిఫికెట్లను వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 13న జిల్లాలో నిర్వహించే చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరై జయప్రదం చేయాలని అఖిల్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మణుగూరు మండల కమిటీ నాయకులు జి. సాయి చరణ్, డి. ప్రేమ్ చరణ్, లక్ష్మీ నరసింహ, మనోజ్, సాయి వెంకట్ యోగేష్ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

**- 15–30 రోజుల్లో అన్ని జిల్లాల్లో మిల్లులు ప్రారంభించాలి**

**- కొనుగోలు కేంద్రాల్లో పారదర్శక సేవలు అందించాలి**

**- జిల్లా పర్యవేక్షణ కమిటీల్లో రైతులకు చోటు కల్పించాలి**

**- పత్తి కొనుగోళ్లలో మధ్యవర్తుల జోక్యం ఉండకూడదు**

**- స్లాట్ బుకింగ్ విధానాన్ని సరళీకృతం చేయాలి**

**- రైతులకు కనీస మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలి**

**తెలంగాణ ప్రతినిధి, ఆగస్టు 11, అనంత జనశక్తి న్యూస్**




రానున్న 2026-27 పత్తి సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లను సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ లోని గోల్కొండ హోటల్‌లో పత్తి కొనుగోలు ఏర్పాట్లపై భారత పత్తి సంస్థ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. కష్టపడి పంట పండించిన రైతులకు మార్కెటింగ్‌లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఒకరిద్దరి కారణంగా మొత్తం వ్యవస్థకు చెడ్డపేరు రాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. 'మనం బతకాలంటే రైతు బతకాలి'' అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని పనిచేయాలని మంత్రి సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి పత్తి రైతులకు కనీస మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంట కోతకు దాదాపు రెండు నెలల ముందుగానే పత్తి కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించడం మంచి పరిణామమన్నారు. తెలంగాణలో ప్రకృతిపై ఆధారపడి పత్తి సాగు చేసే చిన్న, సన్నకారు రైతులు అధికంగా ఉన్నందున వారి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు ప్రక్రియను ముందుగానే పకడ్బందీగా సిద్ధం చేయాలని ఆదేశించారు.

**మధ్యవర్తుల జోక్యానికి తావివ్వొద్దు**

పత్తి కొనుగోలు ప్రక్రియలో మధ్యవర్తుల జోక్యానికి ఎలాంటి అవకాశం ఇవ్వకూడదని మంత్రి స్పష్టం చేశారు. రైతుల నుంచి నేరుగా, పారదర్శకంగా పత్తి కొనుగోలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. గత సీజన్లలో నిఘా, అమలు విభాగాలు గుర్తించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ సీజన్‌లో లోపాలు,i అవకతవకలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**రూ.8,667 కనీస మద్దతు ధర**

2026-27 సీజన్‌లో రాష్ట్రంలో సుమారు 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతుందని, సుమారు 25.85 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. పొడవైన పీచు పత్తికి కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.8,667 కనీస మద్దతు ధర ప్రకటించిందన్నారు. గత ఏడాదితో పోలిస్తే రూ.557 పెరిగిందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి రైతుకు కనీస మద్దతు ధర ప్రయోజనం అందేలా చూడాలని, మద్దతు ధర కంటే తక్కువకు పత్తిని విక్రయించే పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**356 మిల్లుల గుర్తింపు**

రాష్ట్రంలోని 356 పత్తి విత్తన తొలగింపు మిల్లులను గుర్తించి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అవసరానికి అనుగుణంగా అన్ని రకాల మిల్లులను ఒకేసారి అందుబాటు లోకి తీసుకురావాలని సూచించారు. 15 నుంచి 30 రోజుల వ్యవధిలో అన్ని జిల్లాల్లో మిల్లులు అందుబాటులోకి వస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు.

**కొనుగోలు కేంద్రాల పెంపు**

గత సీజన్‌లో 122 పత్తి కొనుగోలు కేంద్రాలు ఉండగా, ఈ సీజన్‌లో వాటి సంఖ్యను 131కు పెంచినట్లు మంత్రి తెలిపారు. అన్ని కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పత్తి రాక అధికంగా ఉండే ప్రాంతాల్లో అవసరమైన మేరకు అదనపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఒక ప్రాంతంలో పత్తి మిల్లు అందుబాటులో లేకపోతే సంబంధిత గ్రామాలు, మండలాలను సమీపంలోని గుర్తించిన మిల్లుకు అనుసంధానం చేసి రైతులు ఎక్కువ దూరం ప్రయాణించకుండా చూడాలని ఆదేశించారు. పర్యవేక్షణ కమిటీల్లో రైతులు ప్రతి జిల్లాలో కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కమిటీల్లో రైతు ప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. మార్కెట్ యార్డులు, పత్తి మిల్లుల వద్ద పత్తి రాకను క్రమబద్ధీకరించాలని, అవసరమైతే సాయంత్రం ఆరు గంటల తర్వాత కూడా కొనుగోలు సమయాన్ని స్థానిక కమిటీలు పరిస్థితులకు అనుగుణంగా పొడిగించాలని చెప్పారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతుల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించారు.

**స్లాట్ బుకింగ్ సరళీకృతం**

'కపాస్ కిసాన్' దరఖాస్తులో స్లాట్లను తెరిచే ముందు సంబంధిత జిల్లా కలెక్టర్, జిల్లా మార్కెటింగ్ అధికారులకు సమాచారం అందించి రైతులకు విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రి సూచించారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని మరింత సరళీకృతం చేయాలని, ఒక రైతు లేదా మొబైల్ నంబరుకు అవసరమైన మేరకు పలు బార్‌కోడ్‌ల సౌకర్యం కల్పించాలని అన్నారు. పంట నమోదు సమాచారాన్ని జాతీయ సమాచార కేంద్రం ద్వారా కపాస్ కిసాన్ దరఖాస్తుకు వేగంగా బదిలీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధిక దిగుబడికి ధ్రువపత్రాలు రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్ర సగటు దిగుబడిని ప్రకటించి, దానికంటే అధిక దిగుబడి సాధించిన రైతులకు వ్యవసాయ విస్తరణ అధికారులు డిజిటల్ దిగుబడి ధ్రువపత్రాలను వెంటనే జారీ చేయాలని మంత్రి సూచించారు. దీంతో అధిక దిగుబడి సాధించిన రైతుల పత్తి కొనుగోలు ప్రక్రియ సజావుగా జరుగుతుందన్నారు. పత్తి అధికంగా ఉత్పత్తి అయ్యే ప్రధాన జిల్లాల్లో అవసరమైన మేరకు పత్తి నాణ్యత పరీక్షా ప్రయోగశాలలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

నాణ్యత పరీక్షలు తప్పనిసరి

అన్ని గుర్తించిన పత్తి మిల్లుల్లో పీచు పొడవు, సూక్ష్మత, తేమ శాతం తదితర నాణ్యత ప్రమాణాలను పరీక్షించే పరికరాలు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో నిఘా కెమెరాలు పనిచేసేలా చూడాలని, బరువు కొలిచే యంత్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక సేవలు

రైతులకు కనీస మద్దతు ధరపై పూర్తి అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. రైతు నేస్తం, గ్రామస్థాయి కార్యక్రమాలు, పోస్టర్లు, కరపత్రాల ద్వారా కనీస మద్దతు ధర, కొనుగోలు కేంద్రాలు, నాణ్యత ప్రమాణాలు, స్లాట్ బుకింగ్ విధానం తదితర అంశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. రైతుల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన 1800 599 5779 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్, 88972 81111 వాట్సాప్ చాట్‌బాట్ సేవలను రైతులు వినియోగించుకునేలా ప్రచారం చేయాలని చెప్పారు. ప్రతి మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ప్రత్యేక సహాయ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రద్దీ లేదా పత్తి నిల్వ ఏర్పడినప్పుడు వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు, భారత పత్తి సంస్థ, ఇతర సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. రైతుకు కనీస మద్దతు ధర అందించడమే ప్రధాన లక్ష్యమని తుమ్మల స్పష్టం చేశారు. ఈ విషయంలో ఏ స్థాయిలోనైనా నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘన జరిగితే తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. పత్తి కొనుగోళ్లలో రైతులకు నష్టం కలిగించే చర్యలు, అవకతవకలు చోటుచేసుకుంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్ని శాఖలు, రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు, పత్తి సంస్థ అధికారులు సమిష్టి బాధ్యతతో పనిచేసి ప్రతి రైతుకు కనీస మద్దతు ధర ప్రయోజనం అందేలా చూడాలని ఆదేశించారు.

# బీజేపీ ఆధ్వర్యంలో భారీ తిరంగా ర్యాలీ

**- వందేమాతరం నినాదాలతో మార్మోగిన పట్టణ వీధులు**

**- ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి: బీజేపీ నేతలు**

**- పార్టీలకతీతంగా దేశభక్తితో పాల్గొన్న ప్రజలు**

**- జాతీయ సమైక్యతను చాటిచెప్పిన తిరంగా యాత్ర**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో , ఆగస్టు 11, అనంత జనశక్తి న్యూస్ :**



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా' భారీ ర్యాలీతో కొత్తగూడెం పట్టణ వీధులు వందేమాతరం నినాదాలతో మార్మోగాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీజేపీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యార్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి జాతీయ జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. ప్రకాశం స్టేడియం మైదానం నుంచి ప్రారంభమైన తిరంగా యాత్ర బస్టాండ్ సెంటర్, అండర్‌గ్రౌండ్, సింగరేణి సూపర్ బజార్ సెంటర్, గణేష్ టెంపుల్ సెంటర్, ఓల్డ్ డిపో సెంటర్, గోధుమవాగు వంతెన మీదుగా లక్ష్మీదేవిపల్లి వరకు కొనసాగింది.

ఈ సందర్భంగా కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలనే ఉద్దేశంతో దేశవ్యాప్తంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశభక్తిని పునరుద్ధాటించడంతో పాటు 'వికసిత్ భారత్', 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' సంకల్పాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండలాలు, నియోజకవర్గ కేంద్రాల్లో బీజేపీ, బీజేవైఎం శ్రేణుల ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీలు, బైక్ యాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ఏ ఒక్క రాజకీయ పార్టీకి పరిమితమైనది కాదన్నారు. పార్టీలకతీతంగా ప్రజలందరూ ఇందులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కుల, మత, ప్రాంతీయ భేదాలను పక్కనపెట్టి భారతీయులంతా ఐక్యంగా పాల్గొనాల్సిన జాతీయ కార్యక్రమమని పేర్కొన్నారు. త్రివర్ణ పతాకం భారతదేశ ఆత్మగౌరవానికి, దేశం కోసం ప్రాణాలర్పించిన అమర వీరుల త్యాగాలకు ప్రతీక అని అన్నారు. తిరంగా యాత్ర ద్వారా జాతీయ సమైక్యత, దేశభక్తి భావాలను చాటిచెప్పడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాటోత్ వెంకన్న నాయక్, భోగి కృష్ణ, బిక్షపతి, 'హర్ ఘర్ తిరంగా' కన్వీనర్ గోపి, కోకన్వీనర్ కోల హరీష్, నరేష్, జిల్లా కార్యదర్శులు పుణ్యా నాయక్, మురళి, దురిశెట్టి కుమార్, వీర మధుసూదన్, భీమల్ జైన్, జిల్లా కోశాధికారి ముకుందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు చెరుకు భాగ్యలక్ష్మి, భూక్య దివ్యశ్రీ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మోహనకృష్ణ, మహిళా మోర్చా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి, ఎస్టీ మోర్చా అధ్యక్షురాలు భూక్య స్వాతి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు దుర్గా శ్రీనివాసరావు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జటంగి కృష్ణ, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు చాపలమడుగు రాకేష్‌బాబు, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు రహీం, మీడియా కన్వీనర్ రామారావు, ధార్మిక సెల్ కన్వీనర్ కస్తూరి సుధాకర్, లేబర్ సెల్ కన్వీనర్ గుమలాపురం సత్యనారాయణ, వివిధ మండలాల అధ్యక్షులు, బీజేపీ కార్యకర్తలు, అభిమానులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కార్పొరేట్ జాబ్‌లో వచ్చే వర్క్ టెన్షన్స్‌ని ఎలా మేనేజ్ చేయాలి, హ్యాపీగా ఏ భయం లేకుండా ఎలా జాబ్ చేయాలి

మనం జాబ్ చేసినప్పుడు సవాలక్ష టెన్షన్స్ ఉంటాయి. వాటన్నింటినీ చాలా మంది అలానే తీసుకుంటూ జాబ్‌ని కంటిన్యూ చేస్తారు. దీనికి కారణం నెలనెలా వచ్చే జీతం. చాలా మంది జాబ్ చేసేవారిని దగ్గరికి వెళ్ళి మందలిస్తే వారిలోని ఆందోళన అంతా ఒక్కసారిగా నేను బాగున్నాను అనే మాటలోనే కనిపిస్తుంది. మనకి అప్పగించిన పని గురించి బాస్ వచ్చి ఎలా ఉన్నారు అనగానే... బాగున్నాను అనే మాట చెప్పడం కంటే ముందుగా మనకి అప్పగించిన పనే గుర్తుకొస్తుంది. దీంతో ఏదో అద్దె నవ్వుని ముఖాన పులుముకుని నేను బాగానే ఉన్నాను, మీరు ఇచ్చిన పనిని పూర్తి చేస్తాను. అని చెబుతుంటారు.









**వరల్డ్ మెంటల్ హెల్త్ డే**

బిజీ బిజీ ప్రపంచంలో ఈ కార్పోరేట్ యుగంలో ఏ ఉద్యోగికి కూడా మానసిక ప్రశాంతత లేకుండా పోయింది. ప్రతీ ఒక్కరూ నేను బాగున్నాను అని చెబుతున్నారు. కానీ, ఇది మాట వరకే, దీనిని అంతమొందించాలి. దానికోసం ప్రతీ ఒక్కరూ కూడా కొన్ని విషయాల్ని ఫాలో అవ్వాలి. ఎందుకంటే ఇలా చెబుతూనే ఉంటారు. కానీ, వారి మనసులోని బాధ అలానే పెరిగిపోయి అది డిప్రెషన్‌లా మారే అవకాశం ఉంది. కాబట్టి, జాగ్రత్తగా ఉండాలి.

**పని ఒత్తిడి పెరిగితే**

అదో రకమైన ఆందోళన ఉంటుంది. దీంతో రోజువారీ పనులు చేయడం కష్టంగా మారుతుంది. ఎనిమిది గంటల నిద్ర కరువైపోతుంది. మానసిక ఒత్తిడి పెరుగుతుంది. శారీరకంగా అలసిపోతారు.

**వచ్చే సమస్యలు**

ఇలా నేను బాగున్నాను అంటూ పైకి చెప్పేవారు లోలోపలే కుమిలిపోతుండడాన్ని ఎవరు గమనించరు. వారో నిరాశవాదిగా మారతారు. కుటుంబానికి, తల్లీదండ్రులకి, అందరికీ మానసికంగా దూరమైపోతారు. ఖర్చులు, ఒత్తిడి, నిరంతరాయంగా చేసే పనులు రిలేషన్స్‌ని కూడా దెబ్బతీస్తాయి.

**బాగున్నామనే మాట వెనుక ఏం దాచిపెడుతున్నాం**

హైబ్రిడ్ హ్యాంగోవర్ : అంటే ఎంప్లాయిస్, హైబ్రిడ్ వర్క్ మోడల్‌కి మారేటప్పుడు ఫేస్ చేసే ఛాలెంజెస్ అని అర్థం. దీని వల్ల సమస్యలొస్తాయని చెబుతుండడం

ఇంపోస్టర్ సిడ్రోమ్ : అంటే మీరు మీకున్న స్కిల్స్, సక్సెస్‌ని అనుమానించడం. ఇతరులు మిమ్మల్ని నమ్మినప్పటికీ మీకు టాలెంట్ లేదని వారెక్కడ అనుకుంటోరనని భయం. ఇది మానసిక సమస్య కానప్పటికీ, దీని వల్ల కాస్తా సమస్య వస్తుంది.

సైలెంట్ దు:ఖం : సమస్య ఉన్నప్పటికీ, ఇష్టమైన వారికోసం అలసిపోయినట్లుగా కనిపించకుండా ఉండడం

బర్నౌట్ : ఎక్కువగా ఒత్తిడి వల్ల వచ్చే భావోద్వేగా, శారీరక, మానసిక అలసట.

**సరిగ్గా పనిచేయడం కోసం**

బాగున్నాను అనే మాటని నిజమైన అర్థం వచ్చేలా చేయాలి. దీనికోసం ఎంప్లాయిస్ కొన్ని చేయాలి. వీకెండ్‌లో పూర్తిగా రీచార్జ్ అవ్వడానికి లీవ్ తీసుకోవడం. పనిభారాలని తగ్గించుకోండి. లక్ష్యాలను చేరుకోవడానికి మీరు కష్టపడుతున్నా చేరుకోవట్లేదంటే అవి టైమ్ మేనేజ్‌మెంట్ ప్రాబ్లమ్ కాదు. అవాస్తవిక లక్ష్యాలు.

మీరు మేనేజర్‌తో మాట్లాడండి. మీరు అలసిపోతే మీ మేనేజర్‌కి తెలియజేయండి.

దీంతో చాలా వరకూ మీ సమస్య నుండి బయటపడే అవకాశం ఉంటుంది. ముందుగా మీరు ఎలా ఫీల్ అవుతున్నారో తెలుసుకోవాలి. బాలేకపోవడాన్ని యాక్సెప్ట్ చేయాలి. మీరు మెంటల్లీ హెల్దీగా ఉన్నప్పుడే ఫిజికల్‌గా కూడా ప్రొడక్టివ్ వర్క్ చేస్తారు. ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి.

# 6 యోగా భంగిమలతో అధిక యూరిక్ యాసిడ్ స్థాయిలకు చెక్





కీళ్ల నొప్పులు, గౌట్‌కు దారితీసే అధిక యూరిక్ యాసిడ్  ను తగ్గించుకోవడానికి యోగా గురువు హిమాలయన్ సిద్ధ అక్షర్ 6 ప్రభావవంతమైన ఆసనాలను సిఫార్సు చేశారు. ఈ ఆసనాలు జీవక్రియను వేగవంతం చేస్తాయి, రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి, తద్వారా మూత్రపిండాలు, కాలేయ పనితీరును ఉత్తేజపరచి, శరీరం నుండి విషపదార్థాలు, యూరిక్ యాసిడ్‌ను సమర్థవంతంగా బయటకు పంపడానికి తోడ్పడతాయి. రోజువారీ సాధనతో గౌట్ ప్రమాదాన్ని తగ్గించవచ్చు.







**యూరిక్ యాసిడ్ ఎందుకు పెరుగుతుంది?**

యూరిక్ యాసిడ్ అనేది మన శరీరం పురీన్‌లను (కార్బన్, నైట్రోజన్‌తో కూడిన రసాయన సమ్మేళనాలు) విచ్ఛిన్నం చేసినప్పుడు ఏర్పడే ఒక వ్యర్థ పదార్థం. పురీన్లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకున్నప్పుడు, ఈ యూరిక్ యాసిడ్ నిశ్శబ్దంగా పెరిగిపోతుంది. స్థాయిలు అధికమైనప్పుడు, అది హైపర్‌యూరిసెమియాకు దారితీస్తుంది. దీనివల్ల యూరిక్ యాసిడ్ క్రిస్టల్‌స్‌గా మారి, కీళ్లలో పేరుకుపోయి, తీవ్రమైన నొప్పి, వాపుతో కూడిన గౌట్‌కు కారణమవుతుంది. ఈ పరిస్థితికి మందులు ఉన్నప్పటికీ, యోగా అనేది సమతుల్యతను తీసుకురావడానికి ఒక సహజమైన మార్గం.

"అధిక యూరిక్ యాసిడ్ వల్ల కీళ్లలో అసౌకర్యం, నొప్పి, వాపు, బిగుతు ఏర్పడతాయి. ఈ అసమతుల్యతను నిర్వహించడానికి యోగా అనేది సహజమైన, ప్రభావవంతమైన మార్గం. క్రమం తప్పకుండా సాధన చేయడం వల్ల యోగా జీవక్రియను ప్రోత్సహిస్తుంది, రక్త ప్రసరణను పెంచుతుంది. శరీరం నుండి విషపదార్థాలను సమర్థవంతంగా బయటకు పంపడానికి సహాయపడుతుంది" అని యోగా మరియు ఆధ్యాత్మిక గురువు హిమాలయన్ సిద్ధ అక్షర్ వెల్లడించారు.

యోగా రక్త ప్రసరణను మెరుగుపరచడం, శరీరంలోని విషాన్ని తొలగించడంలో సహాయపడడం, జీవక్రియను పెంచడం ద్వారా యూరిక్ యాసిడ్‌ను మరింత సమర్థవంతంగా ప్రాసెస్ చేయడానికి శరీరానికి సహాయపడుతుంది.

**1. అర్ధ మత్స్యేంద్రాసనం**

ఈ ఆసనం ఉదర అవయవాలకు మసాజ్ చేయడం ద్వారా, కాలేయం , మూత్రపిండాలను ఉత్తేజపరచడం ద్వారా శరీరంలోని విషపదార్థాలను బయటకు పంపుతుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, వెన్నెముకను ఆరోగ్యంగా ఉంచుతుంది.

**2. భుజంగాసనం**

"ఈ భంగిమ వెన్నెముకను బలపరుస్తుంది. అలాగే, ఉదరం వైపు రక్త ప్రవాహాన్ని పెంచుతుంది. ఇది డిటాక్సిఫికేషన్‌కు సహాయపడుతుంది. ఇది బిగుతును తగ్గిస్తుంది, శరీరానికి శక్తినిస్తుంది, మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది" అని అక్షర్ వివరించారు.

ఈ శక్తివంతమైన ఆసనం జీర్ణక్రియకు సహాయపడుతుంది. వాయువును తగ్గిస్తుంది. యూరిక్ యాసిడ్ నిర్వహణకు కీలకమైన మూత్రపిండాలు, కాలేయ పనితీరుకు తోడ్పడుతుంది. ఇది దిగువ వీపు , కీళ్ళను కూడా రిలాక్స్ చేస్తుంది.

**4. త్రికోణాసనం**

ఈ నిలబడి చేసే ఆసనం వశ్యతను పెంచుతుంది. రక్త ప్రవాహాన్ని మెరుగుపరుస్తుంది. వెన్నెముకను బలపరుస్తుంది. ఇది ఉదర అవయవాలను ఉత్తేజపరుస్తుంది. విషపదార్థాలను సమర్థవంతంగా తొలగించడానికి శరీరానికి సహాయపడుతుంది.

**5. ఉత్తానాసనం**

"ఈ ప్రశాంతతను ఇచ్చే భంగిమ మెదడుకు రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. వెన్నెముక, తొడ కండరాలను సాగదీస్తుంది. అలాగే, డిటాక్సిఫికేషన్‌కు మద్దతు ఇస్తుంది" అని అక్షర్ వివరిస్తున్నారు. ఇది ఒత్తిడిని తగ్గిస్తుంది, విశ్రాంతిని ప్రోత్సహిస్తుంది.

**6. శవాసనం**

విశ్రాంతిని ఇచ్చే ఆసనం అయిన శవాసనం, యోగా ప్రయోజనాలను శరీరం గ్రహించడానికి వీలు కల్పిస్తుంది. ఇది ఒత్తిడి హార్మోన్లను తగ్గిస్తుంది. నిద్రను మెరుగుపరుస్తుంది. శరీరం సహజంగా కోలుకోవడానికి సహాయపడుతుంది.



# కలల గాలిలో తేలియాడనీ నన్ను!

మలయాళ కథానాయకుడు నివిన్ పౌలీ, మమితా బైజు ప్రధాన పాత్రలో రూపొందిన చిత్రం 'బెత్లెహం కుడుంబ యూనిట్'. గిరీష్ ఏడీ దర్శకత్వం వహించారు. భావన స్టూడియోస్ సంస్థ నిర్మించింది. ఈ సినిమా ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ప్రచారంలో భాగంగా 'ఇల్లే ఇల్లా' అనే పాటను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. "లేదు, లేదు, లేదు.. అది కళ్లలో లేదు, మాటల్లోనూ లేదు.. ఎక్కడా లేదు. నా కళ్లముందు పసుపు రంగులో ఏదో వికసించింది. ఒక చల్లని చిన్న అద్భుతం కలల గాలిలో నన్ను తేలియాడనీ.." అంటూ సాగుతున్న ఈ గీతం సినీప్రియుల్ని ఆకట్టుకుంటుంది. సుహైల్ కోయా సాహిత్యమందించిన ఈ గీతాన్ని కపిల్ కపిలన్ ఆలపించారు. రొమాంటిక్ డ్రామాగా తీర్చిదిద్దుతున్న ఈ సినిమాలో సంగీత్ ప్రతాప్, సురేశ్ కృష్ణ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

# 'కొత్తలోక' రికార్డులు బ్రేక్ చేసిన మోహన్‌లాల్ కుమార్తె సినిమా..

మలయాళ యాక్షన్ థ్రిల్లర్ 'తుడక్కం'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు మోహన్ లాల్ కుమార్తె విస్మయ జూడ్ ఆంటోనీ జోసెఫ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం రికార్డులు సృష్టిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఓపెనింగ్స్ సాధించిన మహిళా ప్రాధాన్యమున్న మలయాళ చిత్రంగా నిలిచింది.

బాక్సాఫీస్ నివేదికల ప్రకారం.. 'తుడక్కం' మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.6.8 కోట్లు వసూలు చేసింది. భారత్‌లో 1100ల థియేటర్‌లలో దీన్ని విడుదల చేశారు. ఓవర్సీస్‌లోనూ దీనికి మంచి స్పందన రావడంతో రికార్డు నెలకొల్పింది. మొదటి రోజు భారత్‌లో రూ.2.55 కోట్లు సొంతం చేసుకుంది. దీంతో అంతకుముందు కల్యాణి ప్రియదర్శన్ నటించిన 'కొత్తలోక' సినిమా తొలిరోజు (రూ.6.63 కోట్ల) ప్రపంచ వ్యాప్త వసూళ్లను 'తుడక్కం' అధిగమించింది.



విస్మయ మోహన్‌లాల్, ప్రముఖ నిర్మాత ఆంటోనీ పెరుంబావూర్ కుమారుడు ఆశిష్ జోస్ ఆంటోనీలకు ఇది తొలి చిత్రం. 'మీను' పాత్రలో విస్మయ ఎంతో సహజంగా నటించగా, ఆశిష్ సైకో పాత్రలో తన నటనతో భయపెట్టారు. సమాజంలో మహిళలు ఎదుర్కొనే వేధింపులు, లైంగిక దాడులు, మనుగడ కోసం ఒక యువతి చేసే పోరాటం నేపథ్యంలో సాగే ఈ క్రైమ్ థ్రిల్లర్‌లో మోహన్‌లాల్ అతిథి పాత్రలో కనిపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

# హాట్ టాపిక్‌గా మారిన 'టాక్సిక్' రన్‌టైమ్

ప్రస్తుతం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్'ఒకటి. యశ్ ప్రధానపాత్రలో గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికర వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. 'టాక్సిక్' రన్‌టైమ్ 3 గంటల 11 నిమిషాలంటూ ప్రచారం జరుగుతోంది. సినిమాలో అధికంగా రక్తపాతం, యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. గీతూమోహన్ దాస్ తన కథపై నమ్మకంతోనే ఈ నిడివితో సెన్సార్‌కు పంపారని సమాచారం

ఇక, ఈ సినిమాను ప్రైమ్ బిగ్ స్క్రీన్ ఫార్మాట్ అయిన ఐమాక్స్‌లో కూడా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు . కన్నడ ఇండస్ట్రీ నుంచి ఐమాక్స్ ఫార్మాట్‌లో విడుదలవుతోన్న రెండో సినిమా ఇది కాగా.. రెండు ఐమాక్స్ చిత్రాలను (కేజీఎఫ్ 2, టాక్సిక్) తన ఖాతాలో వేసుకున్న ఏకైక కన్నడ స్టార్‌గా యశ్ రికార్డు సృష్టించారు. త్వరలోనే దేశవ్యాప్తంగా ఐమాక్స్ బుకింగ్స్ కూడా ప్రారంభం కానున్నాయి. కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై భారీ స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాలో యశ్‌కు జోడీగా నయనతార, కియారా అడ్వాణీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి, తారా సుతారియా నటించారు.




# కోహ్లీ ఆ విషయంలో రాజీపడడు.. నా బెస్ట్ మూమెంట్ అదే: మాజీ ఫీల్డింగ్ కోచ్




టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై భారత మాజీ ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్ ప్రశంసలు కురిపించాడు. అతడు ఫీల్డింగ్‌లో చూపించే ఎనర్జీ అద్భుతమని.. ప్రాక్టీస్‌లో చూపించే ఉత్సాహాన్ని మ్యాచ్‌లోనూ ప్రదర్శిస్తాడని పేర్కొన్నాడు. విరాట్ ప్రభావం జట్టులోని మిగతా ఆటగాళ్లపై ఉంటుందని మాజీ ఫీల్డింగ్ కోచ్ తెలిపాడు.

"కోహ్లీ ఫీల్డింగ్‌లో రాజీపడడు. పవర్ ప్లేలో కవర్స్, షార్ట్ మిడ్ వికెట్‌లో డైవ్‌లు చేస్తూ బంతిని ఆపే విధానం అద్భుతంగా ఉంటుంది. బంతి తనవైపు రానప్పుడు కూడా అతడి ఫీల్డింగ్ ప్రయత్నాలు ఆగవు. ఇది నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికిన కోహ్లీ.. ఈ దశలోనూ చివరి ఓవర్లలో లాంగాన్‌లో ఫీల్డింగ్ చేస్తాడు. అక్కడి నుంచి పరుగెత్తుకొస్తాడు. కోహ్లీతో కలిసి ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు.. అతడిని స్ఫూర్తిగా తీసుకుని తమ సామర్థ్యాలకు మించి రాణించిన ఆటగాళ్లు కూడా ఉన్నారు. అది విరాట్ లెవల్" అని దిలీప్ వివరించాడు.

"నా కెరీర్‌లో అత్యుత్తమ క్షణం గురించి ఆలోచిస్తే 2024 టీ20 ప్రపంచ కప్ గుర్తుకొస్తుంది. కేవలం ఆ ట్రోఫీ మాత్రమే కాదు,

ఆ తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌లో నెలకొన్న వాతావరణం. గత నాలుగేళ్లుగా ఆ కుర్రాళ్లు పడ్డ కఠిన శ్రమను నేను గ్రహించగలిగాను. ఆ అనుభూతిని ఎప్పటికీ నా మనసులో భద్రపరుచుకుంటాను" అని దిలీప్ తెలిపాడు. నవంబర్ 2021లో భారత జట్టులో చేరిన దిలీప్ ఇటీవల కోచ్ పదవికి రాజీనామా చేశాడు. అతను ఫీల్డింగ్ కోచ్‌గా ఉన్నప్పుడు టీమ్ఇండియా రెండు టీ20 ప్రపంచ కప్‌లు (2024, 2026), ఛాంపియన్స్ ట్రోఫీ (2025), రెండు ఆసియా కప్‌లు (2023, 2025) సాధించింది. 2023 వన్డే ప్రపంచ కప్, డబ్ల్యూటీసీలో రన్నరప్‌గా నిలిచింది.

# సిరాజ్ కాదు.. టీమ్ఇండియాకు అతనే ఎక్స్-ఫ్యాక్టర్: శ్రీలంక మాజీ ఆల్‌రౌండర్

శ్రీలంక, భారత్ మధ్య ఆగస్టు 15 నుంచి రెండు టెస్టుల సిరీస్ ప్రారంభంకానుంది. గాయం కారణంగా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అందుబాటులో లేకపోవడం టీమ్ఇండియాకు ఇబ్బందికరంగా మారింది. అయితే, గుర్నూర్ బ్రార్ భారత జట్టుకు ఎక్స్-ఫ్యాక్టర్ కాగలడని శ్రీలంక మాజీ ఆల్‌రౌండర్ ఫర్వేజ్ మహరూఫ్ అభిప్రాయపడ్డాడు. ప్రసిద్ధ్ కృష్ణ, అకిబ్ నబీ, గుర్నూర్‌లతో కూడిన పేస్ దళానికి సిరాజ్ నాయకత్వం వహిస్తాడు. తుది జట్టులో గుర్నూర్‌కు చోటు దక్కుతుందా? లేదా అనేది ఆసక్తికరంగా మారింది.

"బుమ్రాకు రివర్స్ స్వింగ్ చేయగల సామర్థ్యం ఉంది. ముఖ్యంగా పాత బంతితో అద్భుతంగా రివర్స్ స్వింగ్ రాబడతాడు. అతను లేకపోవడం భారత్‌కు పెద్దలోటు కానుంది. సిరాజ్ మంచి బౌలరే. కానీ బుమ్రాతో పోల్చి చూసినప్పుడు మాత్రం కొంత తేడా కనిపిస్తుంది. వార్మప్ మ్యాచ్‌లో గుర్నూర్ బ్రార్ బౌలింగ్ చేసిన తీరు ఆకట్టుకుంది. అతను టీమ్ఇండియాకు ఎక్స్-ఫ్యాక్టర్ అవుతాడని అనుకుంటున్నా. అతని బౌలింగ్‌లో మంచి వేగం, బౌన్స్ ఉన్నాయి. గుర్నూర్‌లో పోరాట పటిమ ఉంది. అవసరమైతే దూకుడును ప్రదర్శించగలడు.

నేను గనుక భారత జట్టు వ్యూహకర్తల బృందంలో ఉండి ఉంటే గుర్నూర్‌కు కచ్చితంగా ఒక అవకాశం ఇవ్వాలనుకునేవాడిని. అతను భారత్ తరపున కేవలం వైట్‌బాల్ క్రికెట్ మాత్రమే ఆడాడని నాకు తెలుసు. కానీ, అతని బౌలింగ్‌లో ప్రత్యేకత ఉంది. బ్యాటర్ లయను దెబ్బతీయాల్సిన సందర్భాల్లో అతను వేసే చిన్నపాటి స్పెల్స్ అత్యంత ప్రమాదకరమైన ఆయుధంగా మారగలవు. రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్‌లకుతోడుగా మూడో స్పిన్నర్‌గా మానవ్ సుతార్‌ను తీసుకునే అవకాశముంది. రిషభ్ పంత్ విషయంలో శ్రీలంక జాగ్రత్తగా ఉండాలి" అని ఫర్వేజ్ మహరూఫ్ సూచించాడు.




# ప్రశ్నించినందుకు బయటకు పంపించేశారు: హర్భజన్ సింగ్



భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన కెరీర్ తొలినాళ్లలో ఎదురైన ఓ చేదు అనుభవాన్ని గుర్తుచేసుకున్నాడు. 2000లో తనను బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ నుంచి బయటకు పంపడానికి గల కారణాన్ని వెల్లడించాడు. సరైన ఆహారం అందించకపోవడంతో తాను ప్రశ్నించానని, అందుకే తనను ఎన్‌సీఏ నుంచి పంపించారని పేర్కొన్నాడు. ఎన్‌సీఏలో శిక్షణ పొందిన తొలి బ్యాచ్ ఆటగాళ్లలో హర్భజన్ కూడా ఉన్నాడు. "నన్ను ఎన్‌సీఏ నుంచి బయటకు పంపించారు. అది నా తప్పు కాదు. ఈ విషయాన్ని నేను ఇప్పటికీ బహిరంగంగానే చెబుతాను. ఆటగాళ్ల కోసం ప్రత్యేకంగా డైట్ ఏర్పాటు చేశారు. కానీ, దానికి అనుగుణంగా ఆహారం అందించేవారు కాదు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి మార్పు రాలేదు. అందుకే ఒక రోజు నేను ఆ చార్ట్‌ను చించేశాను. నేను చేసిన ఏకైక తప్పు అదే. దీంతో నన్ను ఎన్‌సీఏ నుంచి బయటికి పంపించేశారు. నేను నా హక్కుల కోసం పోరాడాను. నేను ప్రశ్నించకపోతే ఇప్పటికీ అదే డైట్ ప్లాన్ ఉండేది. అప్పట్లో బీసీసీఐలో తమ మాటకు ఎదురుచెప్పే వారిని సహించలేని వారు కొందరు ఉండేవారు" అని భజ్జీ పేర్కొన్నాడు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945